సాగునీటి పారుదలలో లస్కర్ల పాత్ర చాలా కీలకం. కాలువలపై వీరు లేకపోతే నీటి యాజమాన్యం చాలా కష్టం. చివరి ఆయకట్టు వరకు నీరు పారక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం జీతాలు ఇవ్వకపోగా లస్కర్లను తొలగించింది. దీంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. వెంటనే లస్కర్లకు జీతాలు చెల్లించడంతోపాటు ఈ సీజన్‌కు లస్కర్ల నియామకం చేపట్టాలి.

- ఇటీవల జరిగిన డీఆర్సీలో ఎమ్మెల్యేల గళం

లస్కర్ల నియామకానికి ప్రతిపాదనలు పంపండి. ఎస్‌డీఆర్‌ఎఫ్ కింద మంజూరైన అత్యవసర పనుల్లోనే లస్కర్ల నియామకానికి అనుమతులు తీసుకోండి. ఈ సీజన్‌లో అవసరం మేర లస్కర్ల నియామకం జరగాలి. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి.

- కూటమి ప్రభుత్వ ఆదేశాలివి

వచ్చిన అవకాశాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని ఇరిగేషన్ అధికారులు వినియోగించుకున్నారు. అత్యవసర పనుల కిందనే లస్కర్ల నియామకానికి కూడా అనుమతులు పొందారు. కానీ నెల్లూరు జిల్లాలో మాత్రం అధికారుల్లో అంతులేని నిర్లక్ష్యం ఆవహించింది. ఇంతవరకూ అసలు లస్కర్ల నియామానికి ప్రతిపాదనలు పంపలేదు. అత్యవసర పనులకు సంబంధించి టెండర్లు కూడా పూర్తయ్యాయి. ఇక లస్కర్ల నియామకానికి ఏ పద్దు కింద అనుమతులు లభిస్తాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

- జిల్లాలో ఇరిగేషన్ శాఖ పనితీరు ఇది

- సెంట్రల్ డివిజన్ అధికారుల్లో అంతులేని నిర్లక్ష్యం
- ఇంతవరకూ లస్కర్ల నియామకానికి పంపని ప్రతిపాదనలు
- ఓఅండ్‌ఎం కిందనే పెట్టుకోమన్నా పట్టించుకోని వైనం
- నెల్లూరు తప్ప అన్ని జిల్లాలకూ ప్రభుత్వం అనుమతి
- మొదలైన సాగు.. రైతాంగానికి తప్పని అవస్థలు



వారంతే..
మారరంతే!

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్నట్టుగా తయారైంది జిల్లాలోని లస్కర్లు, రైతాంగం పరిస్థితి. రెండేళ్లుగా లస్కర్ల నియామకానికి అనుమతులు ఇవ్వకపోవడంతో అనధికారికంగా లస్కర్ల చేత పనిచేయించుకుంటూ వచ్చారు. ఇందుకు ఇప్పటికీ జీతాలు కూడా ఇవ్వలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతాంగ అవసరాలను దృష్టిలో పెట్టుకొని లస్కర్ల నియామానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నీటి పన్ను తీరువా వసూళ్లు జిల్లాలో జరగకపోవడంతో ఆ పద్దు కింద లస్కర్ల నియామకానికి నిబంధనలు ఒప్పుకోవు. ఈ క్రమంలో ఇటీవల అనుమతులు ఇచ్చిన ఎస్‌డీఆర్‌ఎఫ్ అత్యవసర పనుల కిందనే లస్కర్లను కూడా నియమించుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ప్రభుత్వం సూచించింది. ఇందుకు ప్రతిపాదనలు పంపి అవసరం మేర అనుమతులు పొందాలని ఆదేశించింది. ఈ అవకాశాన్ని అన్ని జిల్లాలు సద్వినియోగం చేసుకున్నాయి. వేగంగా ప్రతిపాదనలు పంపి లస్కర్ల నియామకానికి అనుమతులు పొందాయి. అక్కడ లస్కర్ల నియామకం కూడా పూర్తయింది. కానీ నెల్లూరు జిల్లాలో సెంట్రల్ డివిజన్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఈ ఏడాది కూడా లస్కర్ల నియామకం కష్టంగా మారింది. ప్రభుత్వం అవకాశమిచ్చినా ఇంత వరకూ ప్రతిపాదనలే పంపకపోవడం గమనార్హం. అత్యవసర పనులకు టెక్నికల్ అనుమతులు ఇవ్వడం, వాటికి టెండర్లు పిలవడం అన్నీ జరిగిపోయాయి. ఆ అనుమతుల్లో లస్కర్ల నియామకం లేదు. దీంతో లస్కర్లను నియమించుకోవడం వీలు కాదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

● ఎమ్మెల్యేలనూ పట్టించుకోని అధికారులు

లస్కర్లు లేకపోతే నీటి యాజమాన్యం చాలా కష్టమవుతుంది. అవసరం మేర కాలువలకు నీటి విడుదల చేస్తూ నీటి దుబారాను అరికట్టడంతో పాటు చివరి ఆయకట్టు వరకూ నీరందేలా చేయడంలో లస్కర్లు కీలకంగా వ్యవహరిస్తారు. ఏడాదికి పది నెలలు మాత్రమే వీరు పనిచేస్తారు. జిల్లాలో సుమారు 230 మంది అవసరం కాగా నెలకు రూ.10,500 మాత్రమే వీరికి వేతనంగా చెల్లిస్తుంటారు. గతేడాది లస్కర్లు లేకపోవడంతో సుమారు 20 టీఎంసీల వరకు నీరు దుర్వినియోగం జరిగింది. ఆ నీరు జాగ్రత్త చేసుకొని ఉంటే గతేడాది రబీ సాగు పూర్తి ఆయకట్టులో జరిగి ఉండేది. ఈ ప్రభావంతో కొన్ని రూ.వందల కోట్ల విలువైన ఉత్పత్తి ఆగిపోయింది. ఈ నేపథ్యంలో లస్కర్ల నియామకం, జీతాల గురించి కూటమి ఎమ్మెల్యేలు పదే పదే ప్రస్తావిస్తూ వస్తున్నారు. ఇటీవల జరిగిన డీఆర్సీ

- మిగతా 6లో

'సోమశిల'కు
6,131 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 6,131 ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 70.460 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 3,000, ఉత్తర కాలువకు 550, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రూ.8.92 లక్షలకు
10 శాతం ఇవ్వాల్సిందే!

- ఉదయగిరి సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఏస్టీవో డిమాండ్
- అరియర్స్ బిల్లు మంజూరు కోసం పట్టు
- వారం రోజులపాటు తిరిగిన ఉపాధ్యాయుడు
- చివరకు రూ.46 వేలకు ఒప్పందం
- బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి ఏసీబీ బృందం
- నగదు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత



ఏసీబీ స్వాధీనం చేసుకొన్న నగదు



అధికారుల అదుపులో ఎస్టీవో మమత

ఉదయగిరి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి సబ్ ట్రెజరీ కార్యాలయంపై ఏసీబీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎస్టీవో సీహెచ్ మమత సూచించిన వ్యక్తి పవన్‌కు ఓ వ్యక్తి రూ.40 వేలు లంచం ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. వివరాల్లోకి వెళితే.. వరికుంటపాడు మండలం బోయమడుగుల ప్రాథమికోన్నత పాఠశాలలో వింజమూరుకు చెందిన లోకసాని వెంగయ్య ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈయన అందవలసిన అరియర్స్ రూ.8,92,717లకు సంబంధించి బిల్లును ఎంఈవో కార్యాలయ సిబ్బంది ఉదయగిరి సబ్ ట్రెజరీ కార్యాలయానికి పంపారు. అయితే, బిల్లు మంజూరు చేయాలంటే పది శాతం నగదు ఇవ్వాలని ఎస్టీవో సీహెచ్ మమత డిమాండ్ చేసినట్లు బాధితుడు వెంగయ్య అన్నారు. అంత నగదు ఇచ్చుకోలేనని ప్రాధేయపడుతూ వారం రోజులు ఆ అధికారి చుట్టూ తిరిగినట్టు వాపోయాడు. చివరకు 5 శాతానికి కుదించి రూ.46 వేలు ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. అయితే, లంచం ఇచ్చేందుకు ఇష్టంలేని వెంగయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు మంగళవారం సాయంత్రం రూ.40 వేలు నగదు తీసుకొని ఎస్టీవోను కలవగా కార్యాలయంలో ఉండే పవన్ అనే వ్యక్తికి ఇవ్వమని సూచించారు. కార్యాలయం వద్ద అతనికి నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు అంజనేయరెడ్డి, విజయకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● లంచం అడిగితే ఫోన్ చేయండి : డీఎస్పీ

ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ ఎస్.శిరీష విలేకరులతో మాట్లాడుతూ ట్రెజరీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించడంతోపాటు ఎస్టీవో మమతను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 9440440057తోపాటు తన నెంబర్ 9440446184కు ఫోన్ చేయాలని సూచించారు. ఫిర్యాదుదారు పేరు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

లంచం ఇవ్వడం ఇష్టంలేకే



ట్రెజరీ అధికారులకు లంచం ఇవ్వడం ఇష్టంలేకే ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు బాధితుడు లోకసాని వెంగయ్య తెలిపారు. అరియర్స్ బిల్లు మంజూరు కోసం వారం రోజులు తిప్పుకున్నట్లు తెలిపారు. మొత్తం బిల్లులో పది శాతం ఇస్తేగాని బిల్లు మంజూరు చేయమని తేల్చిచెప్పారని, చివరకు ఐదు శాతం ఇస్తామనడంతో ఫైలు కదిలించినట్లు ఆవేదన చెందారు. అయితే, వారికి లంచం ఇవ్వడం ఇష్టంలేక ఏసీబీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

● ప్రభుత్వ కార్యాలయాల్లో వణుకు

ఉదయగిరి సబ్ ట్రెజరీ కార్యాలయంపై ఏసీబీ దాడులు చేస్తున్నారని గంటల వ్యవధిలో పట్టణమంతా దావాలనంలా వ్యాపించింది. దీంతో ఆ కార్యాలయ సమీపంలో ఉన్న తహసీల్దారు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగుల్లో వణికిపోయారు. తమ కార్యాలయాల్లో కూడా దాడులు జరుగుతాయోమోనని భీతిల్లిపోయారు. కొందరు ఉద్యోగులు, సిబ్బంది కార్యాలయాల నుంచి బయటకు వెళ్లిపోయారు.



లింగసముద్రంలోని ఓ ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎరువులు, పురుగు మందుల
నిల్వలో తేడా!

- రూ.5.68 లక్షల విలువైనవిగా గుర్తించిన విజిలెన్స్
- లింగసముద్రంలోని రెండు షాపుల్లో తనిఖీలు

లింగసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు, జిల్లా వాణిజ్య పన్నుల అధికారి విష్ణురావు సంయుక్తంగా లింగసముద్రంలోని శ్రీఅమృత ఏజెన్సీస్ ఎరువుల షాపు, శ్రీ వీరబ్రహ్మేంద్ర విత్తనాల షాపును తనిఖీ చేశారు. ఈ పాస్ మిషన్లను, నిల్వ రిజిస్టర్లను వారు తనిఖీ చేశారు. ఆ తర్వాత గోదాముల్లోని ఎరువులు, విత్తనాల నిల్వల రికార్డులను పరిశీలించగా, తేడాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీవీరబ్రహ్మేంద్ర షాపులో రూ.4.70 లక్షలు, శ్రీ అమృత ఏజన్సీస్‌లో రూ.98 వేలు మొత్తం రూ.5.68 లక్షల ఎరువులు, విత్తనాల వివరాలు రికార్డుల్లో లేవని తెలిపారు. దీంతో అమ్మకాలను తాత్కాలికంగా ఆపివేయించినట్లు తెలిపారు. అలాగే ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీకే అమ్మాలని వారు డీలర్లను హెచ్చరించారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయ అధికారి టి అబ్రహాం లింకన్ తెలిపారు.

ఊపిరితీస్తోంది!

» జిల్లాలో తీవ్రమవుతున్న శ్వాసకోశ వ్యాధి

- వివరాలు 6లో

దివ్యాంగ చిన్నారులు, మానసిక వైకల్యంతో బాధపడుతున్న పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపింది. కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం చూపడం, రవాణా భత్యం, సహాయకులకు నగదు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పది నెలలకు రావాల్సిన అన్ని రకాల భత్యాలను విడుదల చేసింది.

భవిత కేంద్రాల
బకాయిలు వచ్చేశాయ్!

- ఐదేళ్లుగా మొండిచేయి చూపిన వైసీపీ
- బాధితులకు తీపి కబురందించిన కూటమి ప్రభుత్వం
- పది నెలల బిల్లులు రూ.65.29 లక్షలు విడుదల

నెల్లూరు (విద్య), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 38 భవిత కేంద్రాలు ఉండగా 16 సొంత భవనాల్లోను, మిగిలినవి ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల్లో 3 వేల మంది పిల్లలు ఉండగా 66 మంది రీసోర్స్ పర్సన్లు, 14 మంది ఫిజియోథెరపిస్టులు, 46 మంది ఆయాలు పని చేస్తున్నారు. సిబ్బంది పర్యవేక్షణలో భవిత కేంద్రాల్లో విద్య వృత్తి నైపుణ్యం, దినచర్యలు, శారీరక ధృడత్వం శిక్షణతోపాటు ఫిజియోథెరపీ అందిస్తారు. గడిచిన ఐదేళ్లలో ఈ కేంద్రాల నిర్లక్ష్యానికి గురికాగా తాజాగా కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి సారించింది. 2023-24 సంవత్సరానికి పదినెలలకు రావాల్సిన అన్ని రకాల బకాయిలను విడుదల చేసింది. వాటిని లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసేలా సమగ్రశిక్ష కార్యాచరణ సిద్ధం చేసింది. జిల్లాలోని అన్ని కేంద్రాల్లోని 2,624 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు రూ.65.29 లక్షలు విడుదలయ్యాయి. సమ గ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్ ఉషారాణి మాట్లాడుతూ విడుదలైన నిధులను ఆయా విభాగాలకు చెందిన లబ్ధిదారుల ఖాతాలకు త్వరలో జమ చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు విడుదలైన వివిధ రకాల భత్యాలు

ప్రోత్సాహకాలు	విద్యార్థులు	విడుదల (రూ.లలో)
హోమ్‌బేస్డ్ అలవెన్స్	380	11,40,000
ఎస్కార్ట్ అలవెన్స్ (1 నుంచి 8వరకు)	270	8,10,000
ఎస్కార్ట్ అలవెన్స్ (9 నుంచి ఇంటర్‌వరకు)	179	4,47,000
ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ (1 నుంచి 8వరకు)	303	9,09,000
ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ (9నుంచి ఇంటర్‌వరకు)	179	5,37,000
బాలికల అలవెన్స్ (1 నుంచి 8వరకు)	1013	20,26,000
బాలికల అలవెన్స్ (9నుంచి ఇంటర్‌వరకు)	330	6,60,000

సంగంలోని సంగమేశ్వరాలయంలో కార్తీకమాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మంగళవారం రాత్రి కనుమళ్ల సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు సహస్ర లింగార్చన నిర్వహించారు. ఇందులో భాగంగా మట్టితో తయారు చేసిన చిన్న సహస్ర లింగాలను శివలింగాకారంలో అమర్చి, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. -సంగం, (ఆంధ్రజ్యోతి)

వైభవంగా సహస్ర లింగార్చన



రాళ్లపాడు సమస్యలపై ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావన

కందుకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వ్యవసాయానికి జీవనాడిగా ఉన్న రాళ్లపాడు ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు మంజూరు చేసి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా ఈ ప్రాజెక్టుకు సోమశిల నుంచి ప్రతిఏటా 1.5 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా కనీసం ఒక్క టీఎంసీ కూడా రావటం లేదని, ఈ సమస్యతో పదేళ్లుగా రాళ్లపాడు ఆయకట్టు పరిధిలో వరిసాగుకు రైతులు దూరంగా ఉంటున్నారని తెలిపారు. రాళ్లపాడుకు సోమశిల జలాలు వచ్చే గొట్టిపాటి కొండప నాయుడు ఉత్తర కాలువ విస్తరణ పనులను గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. అలాగే రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు పనులకు ఎన్నో ఏళ్లుగా మోక్షం కలగడం లేదన్నారు. 15కి. మీటర్ల పొడవున ఈ కాలువను పొడిగిస్తే 6వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. రాళ్లపాడు ప్రాజెక్టు నిర్వహణలో కూడా సమస్యలు ఉన్నాయని, ప్రాజెక్టు అంతా పూడికతో నిండిపోయి ఉన్నందున డ్రిప్ కార్యక్రమంలో ఈ ప్రాజెక్టును చేర్చి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

వైభవంగా పెన్నా హారతి



కలువాయి మండలం రాజుపాళెంలో ఉన్న పరమానంద ఆశ్రమం సమీపంలోని పెన్నానదిలో మంగళవారం సాయంత్రం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని త్రిదండి రామానుజ చిన జీయర్ స్వామివారి పర్యవేక్షణలో నదీహారతి నిర్వహించారు. పెన్నాలో ప్రత్యేక పూజలు నిర్వహించి చినజీయర్ స్వామి నదికి హారతి ఇచ్చారు. అనంతరం ఆశ్రమంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఆశ్రమంలో వసతి సముదాయాలను చినజీయర్‌స్వామి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ఈదూరు రామాచార్యులు, ఎన్‌డీసీసీబీ మాజీ ఛైర్మన్ వేమారెడ్డి శ్యామ్ సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

-కలువాయి (ఆంధ్రజ్యోతి)

కోలుకున్న విద్యార్థులు

● ప్రిన్సిపాల్ సరెండర్

కొడవలూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో చంద్రశేఖరపురంలో ఉన్న ఏకలవ్య గిరిజన పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థులు కోలుకున్నారు. వారిని మంగళవారం టీడీపీ మండల నాయకులు కేతు వెంకట రమణారెడ్డి, జొన్న శివ, ప్రసాద్‌రెడ్డి, జనసేన నేత గునుకుల కిషోర్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు కేసీ పెంచలయ్య పరామర్శించారు. అనంతరం విద్యార్థుల భోజనం పరిశీలించారు. కాగా కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురికావడానికి ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమే కారణమని భావించిన ఉన్నతాధికారులు ఆయనను విధుల నుంచి జిల్లా కేంద్రానికి సరెండర్ చేశారు. దీంతో హర్షం వ్యక్తం చేశారు. అయితే ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు కేసీ పెంచలయ్య ఆధ్వర్యంలో గిరిజన నాయకులు, కళాశాల విద్యార్థులు కళాశాల ఎదుట నిరసన తెలిపారు. అనంతరం వీపీఆర్ సంస్థ ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ను పాఠశాలకు అందజేశారు.



పంది దాడితో బాలుడికి తీవ్ర గాయాలు

గుడ్లూరు, నవంబరు 19: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన బెల్లంకొండ శ్రీనాథ్‌పై (7) మంగళవారం పంది దాడిచేయడంతో బాలుడికి తీవ్ర గాయమైంది. కాలనీవాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం కాలనీకి సమీపంలో బహిర్భూమికి బాలుడు వెళ్లాడు. అక్కడే ఉన్న ఓ పంది అతని మీద పడి దాడి చేయడంతో బాలుడు ఒక్కసారిగా కేకలు వేశాడు. గమనించిన అటుగా వెలుతున్న కొందరు కర్రలు తీసుకొని ఆ పందిని తరిమేశారు. గాయపడిన బాలుడిని మొదట స్థానిక వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. విచ్చల విడిగా గ్రామంలో సంచరిస్తున్న నాటు పందులను అరికట్టాలని బాలుని బంధువులు పందుల పెంపకందారులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై విచారణ చేపడతామని ఎస్‌ఐ వెంకట్రావు తెలిపారు.



గాయపడిన బాలుడు శ్రీనాథ్

మత్స్యకారుల మణిపూస 'భక్తాని'

చిన్నతనం నుంచి సేవాకార్యక్రమాలు

విద్యార్థులు,క్రీడాకారులకు ప్రోత్సాహం

కరోనా సమయంలో జాలర్లకు చేయూత



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న భక్తాని శ్రీనివాసులు

ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్నది ఆయన నైజం. నిరుపేద మత్స్యకార కుటుంబంలో పుట్టినా, పట్టుదలతో చదువుకుని అంచలంచెలుగా ఉన్నత స్థాయికి చేరుకున్నారు. తాను పుట్టిన ఊరికి, తోటివారికి చేతనైనంత సాయం చేస్తూ పలువురి నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు. చిన్నతనం నుంచి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. అటు విద్యార్థులకు, ఇటు క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నారు విడవలూరు మండలం పొన్నపూడి లక్ష్మీపురం గ్రామానికి చెందిన భక్తాని శ్రీనివాసులు.

పొన్నపూడి లక్ష్మీపురం గ్రామానికి చెందిన భక్తాని జయ రామయ్య, మంగమ్మల పెద్ద కుమారుడు భక్తాని శ్రీనివాసులు ప్రాథమిక విద్య అంతా స్వగ్రామంలో సాగిన, అలహాబాద్ యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేశా రు. చదువు పూర్తయ్యాక కొన్నాళ్లు మహేంద్ర కంపెనీలో పనిచేసి, అనంతరం ఆక్వారంగంలో అడుగుపెట్టారు. తొలుత చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ మార్కెట్‌లో మంచిపేరు సంపాదించుకున్నారు. ఆ తరువాత కుటుంబ సభ్యులు, మత్స్యకారుల ప్రోత్సాహంతో శ్రీ లక్ష్మీగణ పతి సీఫుడ్స్ కంపెనీ ప్రారంభించి ఉన్నతస్థితికి చేరుకున్నారు.

● మత్స్యకారులకు చేయూత

చిన్నతనం నుంచి సేవాభావం కలిగిన శ్రీనివాసులు మత్స్యకార పిల్లలకు తన సొంత ఖర్చులతో విద్యాబోధన, క్రీడల పట్ల ఆసక్తి ఉన్నవారికి ప్రోత్సాహం అందచేస్తున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, ఇతర సామాజిక సేవలు చేస్తున్నారు.

● టీచర్ల కొరత ఉన్న లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో సొంత నిధులతో విద్యావలంటీరును నియమించారు. అంతేగాక పాఠశాలకు అవసరమైన కుర్చీలు, బల్లలు, వాటర్ ఫిల్లర్లు, పిల్లలు ఆడుకునేందుకు జారుడు బల్లలు, ఊయల్లు సమకూర్చారు.

● విడవలూరు డిగ్రీ కళాశాలకు రూ.15 వేలతో కుర్చీలు అందజేశారు. విడవలూరు, చౌకిచర్ల, పెద్దపాళెం, ఇస్కపల్లి, పొన్నపూడి లక్ష్మీపురం, రామచంద్రాపురం, కంచరపాళెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సొంత నిధులతో సరస్వతి విగ్రహాలను ఏర్పాటు చేశారు.

కుటుంబ సభ్యుల సహకారం

చిన్నతనంలో తాను పడిన కష్టాలు ఎవరూ పడకూడదనే ఆలోచనతో మత్స్యకార గ్రామాల్లోని పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నా. పిల్లల చదువునకు, క్రీడాకారుల ఉన్నతికి తన వంతు సాయం చేస్తున్నా. భార్య మాధవి, ఇద్దరు తమ్ముళ్ల సహకారంతోనే ఇవన్నీ చేస్తున్నా.

- భక్తాని శ్రీనివాసులు



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న భక్తాని శ్రీనివాసులు

● కరోనా సమయంలో మత్స్యకార గ్రామాల్లో సుమారు రూ.20 లక్షలతో కూరగాయలు, నిత్యావసర వస్తువులను ఉచితంగా అందచేశారు.

● మత్స్యకార గ్రామాల్లో విద్యను ప్రోత్సహించేందుకు 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు.

● ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పునరావాస కేంద్రాల్లోని పేదలకు దుప్పట్లు, భోజన వసతి కల్పిస్తున్నారు.

వ్యక్తి

● తీరప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేస్తున్నారు.

- విడవలూరు, (ఆంధ్రజ్యోతి)



మహిళకు మొబైల్ అందజేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

బిల్లులు లేని మొబైళ్లను కొనద్దు!

● ప్రజలకు ఎస్పీ కృష్ణకాంత్ విజ్ఞప్తి

● రికవరీ చేసిన ఫోన్లు బాధితులకు అందజేత

నెల్లూరు (క్రైం) నవంబరు 19, ఆంధ్ర జ్యోతి): తక్కువ ధరకు వస్తున్నాయి కదా అని బిల్లులు లేని మొబైళ్లను కొనుగోలు చేయొద్దని ఎస్పీ కృష్ణకాంత్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మొబైల్ హంట్ ద్వారా చోరీ అయిన 700 మొబైళ్ల ను పోలీసులు స్వాధీ నం చేస్తున్నారు. మంగళ వారం నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో బాధితులకు ఎస్పీ సెల్‌ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ హంట్ అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసు కున్న బాధితులకు రూ.1.5 కోట్ల విలువ చేసే 700 ఫోన్లను అందచేశామ న్నారు. ఇప్పటివరకు ఏడు విడతల్లో రూ.8 కోట్ల విలువ చేసే 3వేల ఫోన్లను, కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రూ.8 లక్షల విలువ చేసే 40 మొబైళ్లను బాధితులకు అందచేశామన్నారు. పోలీసు వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేస్తూ పోగొట్టుకున్న మొబైల్స్ తిరిగి అందచేయడమే మొబైల్ హంట్ సేవలప్రధాన ధ్యేయమన్నారు. సరైన బిల్లులు లేని, కొత్త, సెకండ్ హ్యాండ్ మొబైల్స్‌ను కొనుగోలు చేయవద్దని సూచించారు. మొబైల్ ఫోన్ల రికవరీలో శ్రమించిన సైబర్ క్రైం అనాలసిస్ బృందాన్ని, పోలీసుస్టేషన్ల పరిధిలో సిబ్బందిని ఎస్పీ అభినందించారు. మిగిలిన ఫోన్లను కూడా రికవరీ చేసి బాధితులకు అందచేస్తామని, మొబైల్ హంట్ వాట్సప్‌ను (9154305600) ఎవరైనా తప్పుగా వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సూక్ష్మ సేద్యం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, డీఏవో సత్యవాణి, అధికారులు

ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఉండాలి

● పారిశుధ్య మిషన్ సమావేశంలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఉండాలని, ఆ మేరకు ప్రజలందరూ ప్రతిజ్ఞ చేయాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో తాగునీరు-పారిశుధ్య మిషన్ జిల్లా స్థాయి సభ్యుల సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ మరుగుదొడ్లను వినియోగించుకోవటం గ్రామీణ ప్రజల గౌరవాన్ని, ముఖ్యంగా మహిళల గౌరవాన్ని కాపాడుకోవటమే అవుతుందన్నారు. ఆరోగ్య పరంగా వారి జీవితాల్లో పెనుమార్పులకు కారణమవుతుందని తెలిపారు. డిసెంబరు 10వ తేదీ వరకు మరుగుదొడ్ల వినియోగంపై విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకట రమణ, డీపీవో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యం పథకాలపై అవగాహన కల్పించండి

నెల్లూరు(వ్యవసాయం,ఆంధ్రజ్యోతి): సూక్ష్మ సేద్యం పథకాలు, రాయితీలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మంగళవారం సూక్ష్మ సేద్య పథకం విధి విధానాలు, రాయితీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. బిందు, తుంపర్ల నీటితో సాగు పథకాలవైపు రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి, ఏపీ ఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్, పట్టుపరిశ్రమల శాఖ అధికారి సత్యనారాయణ, ఆత్మ పీడీ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ




ఫిబ్రవరిలో 'డీకేడబ్ల్యూ' వజ్రోత్సవాలు

● పూర్వ విద్యార్థినుల సంఘం సన్నాహాలు

నెల్లూరు(విద్య), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని దొడ్ల కౌసల్యమ్మ (డీకే) ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2025 ఫిబ్రవరి నెల రెండోవారంలో వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల పూర్వ విద్యార్థినుల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో జరిగిన సమావేశంలో వారు మాట్లా డారు. కళాశాల ప్రారంభమై 60 ఏళ్లు గడిచిన సందర్భంగా వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నామని, దీనికి సంబంధించిన సావనీర్‌ను ప్రచురిస్తున్నామని తెలిపారు. పూర్వవిద్యార్థులంతా సహకరించి వారి అనుభవాలను dkalumni1964@gmail.comకు మెయిల్ ద్వారా పంపించాలని కోరారు. వజ్రోత్సవ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే వారంతా ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని, కార్యక్రమ నిర్వహణకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. వజ్రోత్సవాల వివరాలు తెలుసుకునేందుకు 9398772966, 9949405595 నెంబర్లను సంప్రదించాలన్నారు. అనంతరం వజ్రోత్సవ బ్రోచర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరితో కలిసి ఆవిష్కరించారు. ఈ సమా వేశంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షురాలు వీ జ్యోతిరెడ్డి, కార్యదర్శి కే కుసుమ కుమారి, సంయుక్త కార్యదర్శి ఎన్ జయలక్ష్మి, కోఆర్డినేటర్ కే కరుణశ్రీ, సభ్యులు డాక్టర్ టీ రంజని, డాక్టర్ మమత, బీ రాజరాజేశ్వరి, డాక్టర్ సీహెచ్ లలిత, ఎస్ రుక్మిణి, హెచ్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఊపిరి తీస్తోంది!



● ఉదయగిరి మండలానికి చెందిన వెంకట సుబ్బయ్య తీవ్రమైన ఊపిరి తిత్తుల వ్యాధితో బాధపడుతూ నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాడు. వైద్య పరీక్షలు నిర్వహించి సీవోపీడీకి గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. వారం రోజులు ఆసుపత్రిలోనే ఉంచుకుని చికిత్స చేసి రూ.1.20 లక్షలు వసూలు చేశారు. సామాన్య మధ్యతగతికి చెందిన సుబ్బయ్య ఈ వైద్యానికి అప్పు చేయాల్సి వచ్చింది.

● ఆత్మకూరు మండలం బట్టేపాడుకు చెందిన గిరిజన యువకుడు చెంచురామయ్య అతిగా ధూమపానం చేయడంతో సీవోపీడీ వ్యాధికి గురయ్యాడు. నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు రోజులుండి వైద్యం చేయించుకున్నాడు. కానీ అక్కడ అన్నీ మందులు లేకపోవడంతో కొన్ని బయట కొనుగోలు చేయాల్సి వచ్చింది. ధూమపానం మానేసి కొంత కాలం క్రమం తప్పకుండా మందులు వాడాలని వైద్యులు సూచించారు.

ఇలా జిల్లాలో సీవోపీడీతో వేల మంది బాధపడుతున్నారు. వ్యాధి మూడవ, నాల్గవ దశకు చేరుకుని మృత్యువాత పడుతున్నారు. కేవలం ఈ ఏడాది అక్టోబర్ నుంచి ఒక్క నెల వ్యవధిలోనే 100 మందికిపైగా సీవోపీడీ తో మరణించడం ఆందోళన కలిగించే అంశం. అంతేకాదు మూడు నెలల్లోనే జిల్లాలో 5 వేల మందికిపైగా ఈ వ్యాధికి గురైనట్లు వైద్యులు చెబుతున్నారు.

- జిల్లాలో తీవ్రమవుతున్న శ్వాసకోశ వ్యాధి
- ఒక్క నెలలో 100 మంది మృత్యువాత
- 3 నెలల్లో 5వేల కేసులు
- 80వేల మందికిపైగా వ్యాధిగ్రస్థులు
- 5 మండలాల్లో అధికం
- ధూమపానం, ఆపై కాలుష్యమే కారణం
- నేడు ప్రపంచ సీవోపీడీ నివారణ దినం

నెల్లూరు (వైద్యం), నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి) : ఊపిరితిత్తులకు సంబంధించి అత్యంత ప్రమాదకరమైన వ్యాధి క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీవోపీడీ). ఇదీ తీవ్రమైన ప్రాణాలు కోల్పోక తప్పని పరిస్థితి. ఈ రోగానికి 80 శాతం ధూమపానం కారణం కాగా, 20 శాతం వాతావరణ కాలుష్యమని వైద్య నిపుణులు చెబుతున్నారు. గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ తర్వాత అత్యధికంగా మరణాలు సీవోపీడీ వల్ల సంభవిస్తున్నాయని గణాంకాలు సూచిస్తు న్నాయి. ఏడేళ్ల క్రితం జిల్లాలో సీవోపీడీ వ్యాధిగ్రస్తులు 30 వేల మంది ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 80 వేలకు చేరింది. ఏటా 1200 మందికిపైగా ఈ వ్యాధితో మరణిస్తున్నారు. తొలిదశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని, వ్యాధి ముదిరితే ఊపిరి తిత్తుల మార్పిడి తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించా లని నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే అపాయమని సూచిస్తున్నారు.



5 మండలాల్లో కేసులు తీవ్రం

జిల్లాలో ధూమపాన ప్రియులకుతోడు పరిశ్రమలు పెరగడం, వాహనాల సంఖ్య రెట్టింపు కావడం, పచ్చదనం తగ్గిపోవడం వంటి కారణాలతో కాలుష్యం పెరిగి సీవోపీడీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, ఆత్మకూరు, మర్రిపాడు మండలాల్లో ఇప్పటికీ ఎక్కువ మంది కట్టెల పొయ్యి వాడుతుండటంతో వాటి నుంచి వెలువడే పొగను పీల్చడం వల్ల ఆయా ప్రాంతాల్లో ఎక్కువ మంది సీవోపీడీకి గురవుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి.

జీజీహెచ్‌లో అన్ని రకాల వైద్య సేవలు

నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి అన్ని రకాల వైద్య చికిత్సలు, ఆధునిక పరికరాలు అందుబాటు లో ఉన్నాయి. రోజుకు 80 మందికిపైగా వ్యాధిగ్రస్తులు ఈ విభాగానికి వస్తుంటారు. ఇక్కడ నలుగురు వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారు. ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రుల్లోనూ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారు. ఆయా ఆసుపత్రుల్లో సీవోపీడీకి చికిత్సలు అందిస్తున్నారు.

నిర్లక్ష్యం తగదు



సీవోపీడీని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయానికి దారి తీస్తుంది. దీనికి ప్రధాన కారణం ధూమపానం. వ్యాధి ముదిరితే నయం చేయడం కష్టం. ఈ వ్యాధిపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన అవసరం. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల కనీసం 6 నెలలకు ఒకసారైనా ఊపిరితిత్తుల పరీక్షలు చేయించుకోవాలి.

- డాక్టర్ ఉమామహేష్, పల్మనాలజిస్ట్, అపోలో ఆసుపత్రి

తక్షణ వైద్యం అవసరం



సీవోపీడీ వ్యాధిగ్రస్తులకు వెంటనే వైద్య చికిత్సలు అందించాలి. లేదంటే వ్యాధి తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. జిల్లాలో సీవోపీడీ కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటి కట్టెల పొయ్యి వాడే వారున్నారు. ఆ పొగకు తోడు వాతావరణ కాలుష్యం, ధూమపానం వల్ల వ్యాధి ప్రబలుతోంది.

- డాక్టర్ శశి భరత్‌కుమార్‌రెడ్డి, పల్మనాలజిస్ట్, కిమ్స్ ఆసుపత్రి

వారంతే.. మారరంతే!

(5వ పేజీ తరువాయి)

సమావేశంలోనూ ఈ అంశాన్ని చర్చించారు. ఆఖరుకు ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో కూడా పలువురు ఎమ్మెల్యేలు లస్కర్ల ప్రాముఖ్యతను ప్రస్తావించారు. ఓ పక్క ఇలా ఎమ్మెల్యేలంతా రైతుల ప్రయోజనాల కోసం గళం విప్పుతుంటే అధికారులు మాత్రం విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. డెల్టా ప్రాంతామైన సెంట్రల్ డివిజన్ పరిధిలోనే ఎక్కువగా లస్కర్లు అవసరమవుతారు. కానీ అక్కడి నుంచి ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లలేదు. అత్యవసర విషయాల్లో కూడా అధికారులు ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం మారినా సెంట్రల్ డివిజన్‌లోని అధికారులు, ఉద్యోగుల పనితీరులో మాత్రం మార్పు రాలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై ఇరిగేషన్ ఎస్‌ఈ దేశా నాయక్‌ను వివరణ కోరగా లస్కర్ల నియామకానికి సెంట్రల్ డివిజన్ నుంచి ఇంకా ప్రతిపాదనలు అందలేద అన్నారు. ఇదివరకే తాను ఆదేశించినట్లు తెలిపారు. కాగా సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజును వివరణ కోరగా ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు.

దత్తత అమూల్యమైంది

● జిల్లా బాలల సంరక్షణాధికారి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దత్తత అనేది అమూల్యమైందని జిల్లా బాలల సంరక్షణాధికారి బీ సురేష్ అన్నారు. దత్తత మాసాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో మంగళవారం పొదుపు గ్రూపు మహిళలకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ చట్టప్రకారం బిడ్డలను అమ్మడం, కొనడం నేరమన్నారు. ఇందుకు మూడేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల కోసం కారా వెబ్‌సైట్‌లో లాగిన్నై వివరాలు పొందుపరిస్తే సీనియార్టీ ప్రకారం వారికి కోర్టు ద్వారా దత్తత ఇస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీపీఎస్ సిబ్బంది సీహెచ్ సుమలత, పీవో ఎన్ఐసీ మంజుల, శిశుగృహ మేనేజర్ పెంచలలక్ష్మి పాల్గొన్నారు.



ఆదమరిస్తే ఆసుపత్రికి వెళ్లాల్సిందే..!



కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారి మధ్యలో డివైడర్లపై పచ్చగా పెరిగిన గడ్డి కోసం మూగ జీవాలు నిత్యం రహదారిపై సంచరిస్తున్నాయి. వీటితో ప్రమాదం పొంచి ఉన్నా వాటి యజమానులు, పోలీసు అధికారులు, హైవే సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతో వాహన చోదకులు ఆదమరిస్తే ప్రమాదానికి గురై ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పలువురు గాయ పడగా, కొందరు మృత్యువాత పడ్డారు. ఈ పరిస్థితి ఎక్కువ వెంకటాచలం మండల పరిధిలోని బురాన్‌పూరు, చెముడుగుంట, కాకు టూరు, వెంకటాచలం, మనుబోలు మండల పరిధిలోని పలు గ్రామాల్లో నెల కొంది. రహదారి మధ్యలోని డివైడర్లలో ఉన్న గడ్డిని పశువులు, ఆవులు, గేదేలు మేసుకుంటూ ఒక్కసారిగా రహదారిపైకి వస్తుండడంతో వేగంగా వచ్చే భారీ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతోన్నారు. దీంతో వాహన చోదకులు భయందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో పచ్చి గడ్డి మొలవకుండా నియంత్రిస్తే మూగజీవాలు రహదారిపైకి వచ్చే అవకాశం ఉండదని స్థానికులు అంటున్నారు.

- వెంకటాచలం,(ఆంధ్రజ్యోతి)

అయ్యో పాపం.. దీనురాలు



ఆమెకు ఎవరున్నారో తెలియదు... ఉన్నా చేరదీసేవారు కరువయ్యారు... సుమారు ఎనభైఏళ్ల పైబడిన వృద్ధురాలు చేజర్ల మండలం ఆదురుపల్లిలో బిక్షాటన చేస్తూ మంగళవారం స్పృహ తప్పి పడిపోయింది. గమనించిన స్థానిక ముస్లిం యువకులు రోడ్ల పక్కన కూర్చోబెట్టి ప్రథమ చికిత్స చేయించారు. ప్రస్తుతం ఆమె కదలలేని స్థితిలో ఉంది. అమెను పలకరించగా సంగం వద్ద పాత వంగల్లు గ్రామమని చెప్పిందని ఆ యువకులు పేర్కొన్నారు. ఆమె పరిస్థితి క్రమక్రమంగా క్షీణిస్తున్నదని, అమెకు సంబంధించినవారు ఎవరైనా ఉంటే ఆదురుపల్లికి రావాలని ముస్లిం యువకులు కోరారు. వారే 108 వాహనానికి సమాచారమిచ్చి ఆమెను ఆసుపత్రికి తరలించారు.

- చేజర్ల, (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పెద్దలపై అనుచిత వ్యాఖ్యలు

● పెళ్లేటిపై అల్లూరు పోలీస్‌స్టేషనులో టీడీపీ నేతల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

అల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెద్దలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, పవన్ కల్యాణ్‌లతో పాటు వారి కుటుంబసభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఫేస్‌బుక్‌లో అసభ్యకరంగా అప్‌లోడ్ చేసిన ఘనటలో గుంటూరు జిల్లా మంగళగిరి మండలం పెదవడ్లపూడి వైసీపీ వర్గానికి చెందిన పెళ్లేటి రాజకుమార్‌పై పార్టీ పట్టణ అధ్యక్షుడు రామిశెట్టి కృష్ణచైతన్య ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, రమేష్, మస్తాన్, రాగాల శీనయ్య, పాశం దయాకర్ పాల్గొన్నారు.

సర్వేపల్లి ఉన్నత పాఠశాలలో సామగ్రి ధ్వంసం

వెంకటాచలం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తలుపులు, కుళాయిలు, కిటికీలు తదితర సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. మంగళవారం పాఠశాలకు వచ్చిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు గుర్తించారు. పాఠశాల ప్రహరీ గోడను దూకి లోపలికి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు ఈ దుశ్చర్యలకు పాల్పడ్డారు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

వెంకటాచలం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న మలుపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. వెంకటాచలం పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మకాలనీకి చెందిన దాసరి కోటయ్య (74) మోటర్ సైకిల్‌పై తన ఇంటికి వెళ్తుండగా రైల్వే గేటు దాటిన తర్వాత ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఉన్న మలుపు వద్దకు వచ్చేసరికి సర్వేపల్లి నుంచి వెంకటాచలం వైపుగా వస్తున్న ఒక ప్రైవేటు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కోటయ్య మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రావెల్ తవ్వకాల అడ్డగింపు

బిట్రగుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్ప గ్రామ సమీపంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు తూర్పున ఉన్న నక్కలగుంటలో టిప్పర్లతో గ్రావెల్ తరలింపును సోమవారం రాత్రి గ్రామస్థులు నెల్లూరు పార్లమెంట్ దివ్యాంగుల కార్యదర్శి ఉప్పుతొలు రవి, పందిపాటి మనోహర్, చల్లా క్రాంతి అడ్డుకున్నారు. జేసీబీతో టిప్పర్లకు మట్టిని లోడింగ్ చేయడాన్ని నిలిపివేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. డ్రైవర్ జేసీబీతో అక్కడి నుంచి ఉడాయించారు. నంబరు లేని టిప్పరును పోలీసులు టిప్పరును అదుపులోకి తీసుకున్నారు. ఉన్నతాధికారులు గ్రావెల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉంచిన నెంబరు లేని టిప్పర్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7301
వెండి కిలో ధర	రూ. 93,600
వెండి ఒక గ్రాము	రూ.96.60

● 'ఉపాధి' ద్వారా పశుగ్రాసం పెంపకం
● వంద శాతం రాయితీ ఇవ్వనున్న ప్రభుత్వం

పాడిరైతులకు ప్రోత్సాహం



పొలాల్లో నిర్వహిస్తున్న గేదెల పెంపకం

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులకు కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సౌజన్యంతో పశుగ్రాసం పెంపకానికి పశుసంవర్ధక శాఖ వంద శాతం రాయితీతో ప్రోత్సాహం అందిస్తోంది. ప్రధానంగా మెట్ట ప్రాంతంలో రైతులు వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తుండటంతో అధికశాతం మంది పాడి పశువుల పెంపకంతో జీవనం సాగిస్తున్నారు.

ప్రభుత్వం ప్రోత్సాహం ఇలా (రూ.లలో)

విస్తీర్ణం	కూలీల	మెటీరియల్	మొత్తం
10 సెంట్లు	3,000	3,599	6,599
20 సెంట్లు	6,000	7,197	13,197
30 సెంట్లు	9,000	10,795	19,795
40 సెంట్లు	12,000	14,394	26,394
50 సెంట్లు	15,000	17,992	32,992

● 10-50 సెంట్ల విస్తీర్ణంలో పెంచేలా

పశుగ్రాసం కోసం ఇబ్బందులు పడుతున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసం పెంచుకోవడానికి ప్రోత్సాహం అందిస్తోంది. ఐదెకరాలలోపు భూమి ఉన్న ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులతోపాటు చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూర్చేలా దీని అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో వైసీపీ సర్కారు ఈ పథకం వర్తింపులో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. దరఖాస్తు చేసుకున్నా మంజూరు చేసిన దాఖలాలు లేవు. అయితే, కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా ఇప్పటికే పలువురు రైతుసేవా కేంద్రాలు, పశు వైద్యశాలల్లో దరఖాస్తు చేసుకొంటున్నారు.

ప్రయాణికుల సౌకర్యాల మెరుగుకు కృషి

● ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి



బీజేపీ కార్యాలయంలో సన్నపురెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

నెల్లూరు (స్టోన్ హౌస్‌పేట), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ నెల్లూరు జోన్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి తెలిపారు. నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం అనేక వ్యవస్థలను, సంస్థలను నిర్వీర్యం చేసిం దని వాటిలో ఆర్టీసీ ఒకటన్నారు. సంస్థలో కార్మికుల సమస్యల పరిష్కారం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, సంస్థ ఆదాయం పెంచేందుకు అందరి సహకారంతో పనిచేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. అక్కడి నుంచి ఆయన ఆర్టీసీ ప్రధాన బస్టాండుకు వెళ్లారు. ఈనెల 21న జోనల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నానని, ఆ కార్యక్రమానికి ఆర్టీసీ అధికారులను స్వాగతించేందుకు వచ్చానని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్, బీజేపీ నాయకులు వంశీధర్ రెడ్డి, రాజేశ్వరి, మధు, వెంకటేశ్వర్లు, గడ్డం విజయ్ కుమార్, మండ్ల ఈశ్వరయ్య, మిడతల రమేష్ పాల్గొన్నారు.



'ఉపాధి' కూలీల ఆందోళన

ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని కోరుతూ మంగళవారం సీతారామపురం మండలం పోలంగారిపల్లి గ్రామప్రజలు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. సంవత్సర కాలంగా తమకు పనులు నిర్వహించడం లేదని పేర్కొన్నారు. మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయని, కానీ తమ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ బెంగళురులో నివాసం ఉండటంతో 100రోజుల పని దినాలను కోల్పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి, కొత్త ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించి పనిదినాలు కల్పించాలని వారు కోరారు.

- సీతారామపురం, (ఆంధ్రజ్యోతి)


బెల్టు దుకాణంపై పోలీసుల దాడి

● వ్యక్తి అరెస్టు, మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు ఇందిరమ్మ కాలనీలోని బెల్టు దుఖాణంపై మంగళవారం రూరల్ పోలీసులు దాడు లు నిర్వహించారు. కాలనీలోని వాటర్‌ప్లాంట్ సమీపంలో మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని సీఐ జి.రాజేశ్వరరావు సమాచారం అందగా ఆయన ఆదేశాలతో ఎస్ఐలు బాజిబాబు, తిరుమల రెడ్డి దాడులు నిర్వహించారు. మద్యం అమ్ముతున్న జంపాని బ్రహ్మానందను అరెస్ట్ చేసి అతని వద్ద నుండి 9మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కావలి మండలంలో కోడి పందేలు, పేకాట, గంజాయి, మద్యం అమ్మకాలు, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడితే సమాచారం అందజేయాలని కోరారు.

మందుల దుకాణంలో అగ్నిప్రమాదం
ఊపిరాడక మహిళ మృతి

నెల్లూరు(క్రైం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మందుల దుకాణంలో జరిగిన అగ్ని ప్రమాదంలో దట్టమైన పొగ కమ్ముకోవడంతో ఊపిరి ఆడక ఆ దుకాణం యజమానురాలు మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరు ట్రంకురోడ్డులోని కోరంవారివీధిలో రామకృష్ణ, రాజ్యలక్ష్మి (43) దంపతులు నివసిస్తున్నారు. వారు తమ ఇంటి కింది భాగంలో శ్రీ దుర్గా పేరుతో మెడికల్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి రాజ్యలక్ష్మి తన సెల్ ఫోన్‌ను షాపులో మరిచిపోయి ఇంటికి వెళ్లింది. మంగళవారం ఉదయం సెల్ ఫోను తీసుకునేందుకు దుకాణం తెరిచింది. అప్పటికే షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి మందులు, వస్తువులు కాలుతూ దట్టమైన పొగ ఆవరించింది. షాపులోకి వెళ్లిన ఆమెకు పొగ కారణంగా ఊపిరి ఆడక సొమ్మసిల్లి అక్కడే పడిపోయింది. సెల్ ఫోన్ తీసుకువస్తానని వెళ్లిన భార్య తిరిగి రాకపోవడంతో రామకృష్ణ షాపు వద్దకు వెళ్లాడు. సొమ్మసిల్లి కిందపడిపోయి ఉన్న భార్యను చికిత్స నిమిత్తం రామచంద్రారెడ్డి ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రామకృష్ణ ఇచ్చిన సమాచారంతో సంతపేట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.





మెడికల్ ఏజెన్సీ వద్ద పోలీసులు, రాజ్యలక్ష్మి మృతదేహం

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని శ్రామికనగర్‌లో దామర్ల దిలీప్ కుమార్ (20) నివాసం ఉంటున్నాడు. రెండేళ్ల క్రితం ఓ నర్సును వివాహం చేసుకున్నాడు. కొన్ని రోజులుగా భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతూ ఉన్నాయి. దిలీప్ తల్లిదండ్రులు ఇద్దరికీ సర్దిచెబుతూ వస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి భార్య డ్యూటీకి వెళ్లి మంగళవారం ఉదయం తిరిగి ఇంటికి చేరుకుంది. వచ్చేసరికి భర్త దిలీప్ కుమార్ ఇంట్లో ఉరికి వేలాడుతూ కనిపించాడు. కేకలు వేయడంతో స్థానికులు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. దిలీప్ తల్లి దామర్ల చంద్రమ్మ ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటనలపై నవాబుపేట పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా కుమ్మెర లక్ష్మి తాండాకు చెందిన కత్రావత్ పుల్యా నాయక్ తన కుటుంబంతో కలిసి ఉపాధి నిమిత్తం కొంత కాలం కిందట నెల్లూరు నగరానికి వచ్చాడు. పెన్నానది వద్ద నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులకు కార్మికుడిగా వెళుతున్నాడు. ఈనెల 17వతేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రా లేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గాలించినా ప్రయో జనం లేకపోవడంతో సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● శెట్టిగుంట రోడ్డుకు చెందిన ఓ వివాహిత ఈనెల 5న ఇంటి నుంచి అదృశ్యమైంది. ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలిం పు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో వివాహిత తల్లి సు జాత సోమవారం రాత్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ ఇద్దరి వివ రాలు తెలిసిన వారు 9440796306, 7396805381, 9440796310 నెంబర్లకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా కోరారు.

న్యూస్ బాక్స్

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

ఉలవపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నేటికోట అడ్డరోడ్డు మలుపు వద్ద మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళుతున్న కందుకూరు మండలం కంద్రావారి పాలెంకు చెందిన దామచర్ల తిరుపతయ్య, జ్యోతి దంపతులను లారీ ఢీకొంది. గాయపడిన వారిని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అంకమ్మ తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

వింజమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. అదే పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఎం. మాల కొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే నిర్వహించాలి

బిట్రగుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వేపై నిర్లక్ష్యం చేయకుండా సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో సుబ్రమణ్యం గ్రామ సచివాలయ సిబ్బందికి సూచించారు. జువ్వలదిన్నె, సీఆర్‌పాలెం, ఏనుగులబావి, ముంగమూరు పంచాయతీ కార్యాలయాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఇంటింటికి వెళ్లి గృహ నిర్మాణాల కొలతలు, కుటుంబ సభ్యుల వివరాల సర్వే, 18ఏళ్లు నిండిన ఆధార్ లింకప్, పోస్టాఫీస్‌లో అకౌంట్ చేయించడంపై సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోవూరుపల్లిలో వైద్య శిబిరం

బిట్రగుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోవూరుపల్లి ఆరోగ్యకేంద్ర ఆవరణలో నెల్లూరు నారాయణ హాస్పిటల్ వైద్యులతో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యనిపుణులు గోపీనాథ్, భరత్ కుమార్, అహ్మద్‌అలీ, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ రాఘవేంద్రరావు పాల్గొని 126మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు నాటకరాణి భాస్కర్, ఇందుపూరు రామ్మోహన్‌రెడ్డి, ఎన్.శీనయ్య, రంగయ్య, కోటేశ్వరావు, తిరుపతి ఉన్నారు.

22న జాబ్‌మేళా

ఆత్మకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ చదివిన యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి అంకమ్మ తిరునాళ్ల

అనంతసాగరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సోమశిల రోడ్డులో వెలసిన గ్రామదేవత అంకమ్మ తిరునాళ్ల బుధవారం నుంచి ఐదు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బట్రెడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు లక్ష్యం ఉండాలి

ఏఎస్ పేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని కలిగి ఉండాలని ఎంఈవో సాయిప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ఠాగూర్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఆటల పోటీల బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు.

రామలింగేశ్వరా.. వేణుగోపాలా..!

- వందలాది ఎకరాల మాన్యం భూములు
- కౌలు రూపంలో లక్షల ఆదాయం
- శిథిలావస్థలో ఆలయాలు
- ధూపదీప నైవేద్యాలకు నోచుకోని వైనం
- లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లో దుస్థితి

వలేటివారిపాలెం, లింగసముద్రం నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం శిథిలావస్థకు చేరింది. ఆలయం శ్లాబు పగుళ్లు రావడంతో వర్షం వస్తే నీరు ఒడుస్తుంది. గర్భగుడిలోనూ ఇదే పరిస్థితి ఉండటంతో పూజచేసే సమయాలలో అర్చకులు, భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్రీ.శ15వ శతాబ్దంలో నిర్మించిన ఆలయంలో ఏడు తలలతో కూడిన సుబ్రహ్మణ్యం స్వామి విగ్రహం ఉంది. ఇలాంటి విగ్రహం శ్రీశైలంలో కూడా లేదని అర్చకులు చెబుతున్నారు. ఆలయానికి చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి ప్రతిసోమవారం వేలాది మంది భక్తులు వస్తుంటారు. భక్తులు స్నానాలు చేసి దుస్తులు మార్చుకునేందుకు గదులు, మరుగుదొడ్లు లేవు. భక్తులు పొంగళ్లు పెట్టుకునేందుకు ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేయలేదు. ఆలయం చుట్టూ ప్రహరీ లేక పోవడంతో ఆకతాయిలు పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారు. స్నానాలు చేసేందుకు కోనేరులోకి దిగేందుకు మెట్లు సక్రమంగా లేవు. కోనేరు అపరిశుభ్రంగా ఉంటుంది. ఆలయానికి 227ఎకరాల మాన్యం భూములున్నాయి. వాటినుంచి కౌలురూపంలో లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

● లింగసముద్రం: పెదపవని వేణు గోపాలస్వామి ఆలయానికి 100ఎకరాల మాన్యం భూమి ఉన్నా దూపదీప నైవేద్యాలు కరువయ్యాయి. ఇంత చారిత్రకమైన ఆలయ పునర్నిర్మాణానికి దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ మన్యం భూములకు ఈ ఏడాది నిర్వహించిన కౌలు వేలంలో రూ.2.80లక్షలు వస్తున్నాయి.

ప్రధాన సమస్యలివే..

గోపురంపైన, గర్భగుడి శిథిలావస్థకు చేరి మొక్కలు మొలిచాయి. గుడి లోపల స్లాబు పెచ్చులూడి పోవడంతో వర్షం కురిసినపుడు దేవతామూర్తుల విగ్రహాలు తడుస్తున్నాయి. లోపల వర్షం నీరు పడకుండా గుడిపైన ప్లాస్టిక్ పట్టాలు కప్పుతున్నారు. పండుగల సమయంలో దేవతా మూర్తుల ఊరేగింపు, ఇతర కార్యక్రమాలను దాతల సాయంతో నిర్వహిస్తున్నారు. దేవాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆలయాల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.


లింగసముద్రం: శిథిలావస్థలో వేణుగోపాలస్వామి ఆలయ గోపురం

వరద ప్రమాద స్థలాల పరిశీలన

సంగం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెన్నానది, బీరాపేరుల్లో వరదలు వచ్చినప్పుడు రక్షణ చర్యలు చేపట్టేందుకు అవగాహన నిమిత్తం ముందుగా ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది మంగళవారం పరిశీలించారు. స్థానిక ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు అధికారులను అడిగి వివరాలు సేకరించారు. అనంతరం అధికారులతో కలిసి పెన్నా, బీరాపేరు వాగు ప్రమాద ప్రదేశాలను పరిశీలించారు.



బాలికల రక్షణ చట్టాలపై అవగాహన

సంగం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికల రక్షణ చట్టాలు, హక్కులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ హేనాసుజన మాట్లాడుతూ బేటీ బచావో బేటీ పడావోలో భాగంగా లైంగిక వేధింపులు, బాల్య వివాహాలను అరికట్టడం, బాలల హక్కులు, చట్టాలపై బాలికలను వివరించారు. కార్యక్రమంలో సఖి వన్ స్టాప్ సెంటరు ప్రతినిధులు, ప్రిన్సిపాల్ సుమతమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు.



సంగం : మాట్లాడుతున్న హేనాసుజన

● **చిన్న వయసులో పెళ్లిల్లు వద్దు**

ఏఎస్‌పేట, నవంబరు 19: బాలికలు చిన్న వయసులో వివాహాలు చేసుకోరాదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక జడ్పీ హైస్కూల్‌లో కిషోర్ వికాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బాల్య వివాహలతో కలిగే నష్టలు వాటి నివారణకు తీసుకోవలసిన అంశాలపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హరికృష్ణ,ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆత్మకూరు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాలల చట్టాలపై అవగాహన సదస్సుతోపాటు మెప్మా ఆధ్వర్యంలో కిషోర బాలికల వికాసం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ హేమసుజన్, మెప్మా టీఎంసీ మాధవి, సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ షేక్ షహనాజ్ మాట్లాడారు. కార్యక్రమంలో సీపీపీవో సునీలత, సూపర్‌వైజర్ రత్నమ్మ, ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్ర కళ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

ఆత్మకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెం నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 107వ శతజయంతిని నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఎస్‌డీ రసూల్, ఎస్‌డీ అమతర్, టీ పెంచలయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● సంగం, నవంబరు 19: స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక బాలికల కళాశాల అధ్యాపకులు నారాయణరెడ్డి, విశ్రాంతి వీఆర్‌వో ఆదిశేషయ్య, ఉపాధ్యాయురాలు మమత, లైబ్రేరియన్ రవీంద్రరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆత్మకూరు : నివాళులర్పిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

● **రక్తదాన శిబిరం**

అనంతసాగరం, నవంబరు 19: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వేము హరిబాబు, రామిరెడ్డి, సుబ్బారెడ్డి, కరీముల్లా పాల్గొన్నారు.


కావలి: నివాళులర్పిస్తున్న నాయకులు

● **ఇందిరాగాంధీకి నివాళి**

కావలి, నవంబరు 19: స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని మంగళవారం కావలి ఇన్‌చార్జి పొదలకూరి కల్యాణ్ ఆధ్వర్యంలో నేతలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్.సురేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఖాదర్‌బాష, ప్రధాన కార్యదర్శి రియాజ్, గురవయ్య, కంచి వెంకటేశ్వర్లు, రవీంద్ర,టీ బాలు తదితరులు పాల్గొన్నారు.

పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోండి

లింగసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాసయోజన పథకం కింద మంజూరైన పక్కాగృహాల నిర్మాణాలకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని కందుకూరు గృహ నిర్మాణ శాఖ డీఈఈ నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన లింగసముద్రం ఎంపీడీఓ కార్యాలయంలోని గృహనిర్మాణశాఖ కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతంలో ఒక్కో గృహానికి ప్రభుత్వం రూ.1.80లక్షలు, పట్టణప్రాంతాల్లో రూ.2.50లక్షలు మంజూరు చేస్తుందన్నారు. లబ్ధిదారులు హౌసింగ్ ఏఈ ఇంజనీరింగ్ అసిస్టెంటుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మంజూరైన వారు సొంత స్థలంలో లేదా పాత లేఅవుట్లలో నిర్మించుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం మండలంలో 281గృహాల నిర్మాణాలు వివిధ దశలలో నిర్మాణాలు ఉన్నాయని తెలిపారు. 570గృహాల నిర్మాణాలు ప్రారంభం కాలేదన్నారు. ఆయన వెంట వీవీ పాలెం ఏఈ నాగరాజు, మండల ఇన్‌చార్జి ఏఈ వెంకటేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నిర్మల, నేతలు బి కొండపనాయుడు, చినకొండయ్య, ప్రసాద్ ఉన్నారు.


మాట్లాడుతున్న హౌసింగ్ డీఈఈ నారాయణరెడ్డి

డిప్యూటీ డీఈవో పాఠశాలల ఆకస్మిక తనిఖీ

సీతారామపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓగురు వాండ్లపల్లి, సీతారామపురం గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆత్మకూరు డిప్యూటీ డీఈవో గోపాల్ తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న సముదాయ సమావేశంలో పాల్గొని ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. అనంతరం పాఠశాల భవనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తాన్‌వలి, ప్రాధానోపాధ్యాయులు ఎస్.కొండయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


భవనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో

● **ఎంఈవో కార్యాలయం తనిఖీ**

ఉదయగిరి రూరల్, నవంబరు 19: స్థానిక ఎంఈవో కార్యాలయాన్ని మంగళవారం ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డీఈవో గోపాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్లు, పలు రికార్డులు పరిశీలించి సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 తోట శ్రీనివాసులు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

● **పాఠశాల సముదాయ సమావేశం**

మండలంలోని అప్పసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల సముదాయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 తోట శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని బిజ్జంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 6-10వ తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు షేక్ నాయబ్ ఏపీజీబీ మేనేజర్‌తో చర్చించి బ్యాంకు ఖాతాలు తెరిపించారు.

అపార్ నమోదును వేగవంతం చేయండి

కందుకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరక్టర్ రామలింగం తెలిపారు. మంగళవారం స్థానిక జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి పాఠశాలలో అపార్ ఐడీ నమోదు ప్రక్రియను పూర్తిచేసేందుకు నిర్లక్ష్యం చేయరాదన్నారు. విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిజిటల్ విద్యాబోధన అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం అపార్ నమోదు తక్కువగా ఉన్న ప్రైవేటు పాఠశాలల ప్రతిని ధులతో సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో జానకీరామ్, ఎంఈవోలు సుబ్బారెడ్డి, అజయ్‌బాబు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.


చర్చిస్తున్న ఆర్జేడీ రామలింగం

రైతులకు శిక్షణ

సీతారామపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అయ్యవారిపల్లిలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి మంగళవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. వివిధ పంటల్లో విత్తనశుద్ధి, ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ చర్యలు, మేలైన విత్తనాల ఎంపిక గురించి రైతులకు సూచనలిచ్చారు.ఈ కార్యక్రమములో మండల వ్యవసాయాధికారి పీ చెన్నారెడ్డి, వీఏఏ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వరికుంటపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు మారుతీదేవి, లక్ష్మీమాధవి, శైలజకుమారి పేర్కొన్నారు. కొండారెడ్డిపల్లి, యర్రంరెడ్డిపల్లిలో కేవీకే శాస్త్రవేత్త సురేఖదేవి, వ్యవసా యాధికారి రవికు మార్‌లతో మినుము పైర్లను పరిశీలించారు.

ఆక్రమణల్లో పాతూరు చెరువు

వింజమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూరు చెరువు అక్రమణలకు గురైంది. పట్టణం రోజురోజుకు విస్తరిస్తున్న తరుణంలో పల్లెవాసులు పట్టణానికి చేరుకుంటున్నారు. దీంతో ఇళ్ల స్థలాలకు డిమాండ్ పెరుగుతున్నందున ఖాళీగా ఉన్న చెరువును ఆక్రమిస్తున్నారు. ఈ చెరువు పక్కనే ఇరిగేషన్ శాఖ కార్యాలయం ఉన్నా కూడా వారు పట్టించుకోవడం లేదు. దీంతో ఆక్రమణలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఈ చెరువుకు ఆయకట్టు లేనందున నీటి పారుదల కాలువలన్నీ అక్రమణలకు గురయ్యాయి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం చెరువును సమ్మర్ స్టోరేజీ కింద ఏర్పాటు చేసేందుకు శిలాఫలకాన్ని వేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవపోవడంతో పనులు ఆగాయి. ఎండాకాలం పట్టణంలో నీటి కొరతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కూటమి ప్రభుత్వం అయినా ఆగిన పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. చెరువును ఆక్రమణల చెర నుంచి విడిపించాలని కోరుతున్నారు.


ఆక్రమణలకు గురైన పాతూరు చెరువు

అమ్మవారి ఆభరణాలకు గ్రామోత్సవం

సంగం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంగమేశ్వరాలయంలోని కామాక్షిదేవికి భక్తులు చేయించిన బంగారు ఆభరణాలను ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మంగళవారం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌కు అలంకరించి, భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ ఆభరణాలను ఆలయ ఇన్‌స్పెక్టర్ చైతన్యకు అప్పగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇటీవల భక్తులు అమ్మవారికి 395.565 గ్రాముల బంగారుతో ఆభరణాలు చేయించారు.

● ఉలవపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న అయ్యప్పస్వామి విగ్రహ గ్రామోత్సవాన్ని మంగళవారం భక్తులు వైభవంగా నిర్వహించారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

● కే సురేష్‌బాబు, కలిగిరి పశువైద్యశాల సంచాలకులు



ఈ ముఖాముఖీ

కలిగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం పాడి రైతులకు అందే రాయితీలను, పాడి పశువులకు వేసే ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యశాల సంచాలకులు, మండల పశువైద్యాధికారి సురేష్‌బాబు తెలిపారు.

? ఎన్ని గోకులం షెడ్లు మంజూరైయ్యాయి.

! ప్రభుత్వం ఇచ్చే రాయితీ కింద 25గోకులం షెడ్లు మంజూరవగా, ప్రారంభ దశలో ఎనిమిది ఉన్నాయి. మిగిలినవి నిర్మాణాలు చేపట్టలేదు.

? పశుగ్రాసంపై ప్రభుత్వం రాయితీలు ఇస్తుందా.

! బహువార్షిక పశుగ్రాసాల సాగునకు, సన్న, చిన్నకారు రైతులకు ఉపాధిహామీ పథకం కింద 0.50ట్లు భూమిలో పశుగ్రాసం పెంచేందుకు ఉచితంగా విత్తనాలు అందజేస్తుంది. అలాగే సాగు చేసేందుకు పెట్టుబడిని కూడి అందజేస్తాం.

? పశుగణనతో ఉపయోగమేమి.

! ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిగే పశుగణనతో పశువుల సంఖ్యను బట్టి ప్రభుత్వం మందుల పంపిణీ, రాయితీలను అందించేందుకు వీలుకలుగుతుంది.

? పశువులకు వచ్చే వ్యాధులపై ఏ చర్యలు చేపడుతున్నారు.

! తెల్లజాతిపశువుల్లో ముద్దచర్మ, నల్లజాతి పశువుల్లో పచ్చికదొమ్మ వ్యాధులకు టీకాలను ఇంటి దగ్గరకు వెళ్లి వేస్తాం.

చుండిలో టీడీపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేయిస్తున్న నేతలు

వలేటివారిపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చుండిలో మంగళవారం మాలకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చెరువుపల్లి మాల్యాద్రి మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో డీలర్ చెరువుపల్లి సాంబశివరావు, నాయకులు ఇరపని లక్ష్యయ్య, బొమ్మినేని మాదవరావు, నరసింహరావు, చొప్పర వెంకట్రావు, ముతకని తిరుపతయ్య, చెరువుపల్లి అశోక్ పాల్గొన్నారు.

కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు

కొండాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భీమవరప్పాడుని కృష్ణ మందిరంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో శ్రీకృష్ణుని మందిరాన్ని ఏర్పాటు చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వాహకులు స్వామివారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విడవలపాటి వెంకయ్య, విడవలపాటి బాబూరావులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆడిట్‌లో నిధుల రికవరీకి ఆదేశం

మర్రిపాడు, 19 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాదికి సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో రూ.86,322ల అవినీతి జరిగిందని, ఆ నిధుల రికవరీకి డ్వామా పీడీ ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయ ఆవరణంలో జరిగిన సామాజిక తనిఖీలో డ్వామా పీడీ గంగాభవాని పాల్గొన్నారు. మండలంలో రూ.11.15కోట్లతో పలు పనులు నిర్వహించగా, కొలతల్లో తేడా, రిజిస్టరు నిర్వహణ సక్రమంగా లేనందున నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీవీవో విజయలక్ష్మి, క్వాలిటీ కంట్రోల్ సీనియర్ అధికారి సతీష్‌బాబు, ఎంపీడీవో నాగేశ్వర ప్రసాద్, ఏపీవోలు నారాయణ పాల్గొన్నారు.


డ్వామా పీడీ రికార్డుల పరిశీలన

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

● సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

వలేటివారిపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తెలిపారు. మంగళవారం ఆమె నవాబ్‌పాలెం ఆక్రమణలోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. గతంలో ప్రభుత్వ భూములను ఆక్రమించి ఆన్‌లైన్, రికార్డుల్లోనూ నమోదు చేసినట్లు కందుకూరు సబ్ కలెక్టర్‌కు హుస్సేన్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను ఆన్‌లైన్‌లో తొలగించి రికార్డుల్లో ఎందుకు తొలగించలేదని రెవెన్యూ సిబ్బందిని ప్రశ్నించారు. రెవెన్యూ రికార్డులతో భూముల్లోకి వెళ్లి పరిశీలించి, ఆక్రమణదారుల పేరుమీద ఉన్న ప్రభుత్వ భూములను ఆన్‌లైన్, రికార్డుల్లో తొలగించి ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ అబ్దుల్‌అమీర్, ఆర్‌ఐ ప్రసాద్, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో అంజని పాల్గొన్నారు.

● ఆక్రమణ స్థలాలు స్వాధీనంపై ఆర్డీవో సమీక్ష

కావలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వాటిపై సర్వే చేసి వెంటనే వాటిని స్వాధీనం చేసుకోవాలని ఆర్డీవో వంశీక్రిష్ణ అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై మంగళవారం ఆయన స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో పట్టణ, మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, కావలి తహసీల్దార్ శ్రావన్‌కుమార్, ఎమ్పీడీవో సీహెచ్ శ్రీదేవి, పట్టణ ప్రణాళికాధికారి వివేక్, మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కావలిలో అక్రమ లేఅవుట్‌లతో పాటు పలు ప్రాంతాలలో ఆక్రమణలు జరిగినా అధికారులు పట్టించుకోవటం లేదని ఒక వ్యక్తి హైకోర్టులో పిటషన్ వేశారని అందులో భాగంగా ఈ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలో ఆక్రమణల స్థలాలు స్వాధీనం విషయం మున్సిపల్ అధికారులకు, మండల పరిధిలోని ఆక్రమణ స్థలాలు స్వాధీనం తహసీల్దార్, ఎమ్పీడీవోలకు అప్పగించారు.

కోవూరు చెరువుకు జలకళ



నిండుకుండలా కోవూరు చెరువు

చాలా కాలం తరువాత ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోవూరు చెరువుకు నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. దీనికి తోడు కనిగిరి రిజర్వాయర్ నుంచి కాలువ ద్వారా చెరువుకు నీరు చేరుతుంది. దీంతో చెరువు నిండుకుండలా మారింది. ఈ నేపథ్యంలో కోవూరు, గంగవరం, గ్రామాల నడుమ చెరువు సోయగాలు శోభాయమానంగా ఉన్నాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో రకరకాల పక్షులు చెరువులో సందడి చేస్తున్నాయి. పలువురు యువకులు హుషారుగా చేపల వేట సాగిస్తున్నారు.

-కోవూరు,(ఆంధ్రజ్యోతి)

నిబంధనలు ఉల్లంఘిస్తే ఊరుకోవద్దు

● అధికారులకు కమిషనర్ సూర్యతేజ ఆదేశం

నెల్లూరు(సిటీ), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భవన నిర్మాణాల్లో కార్పొరేషన్ నియమ, నిబంధనలు ఉల్లంఘిస్తే ఊరుకోవద్దని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని లక్ష్మీపురం ప్రాంతంలో కొన్ని భవనాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొందరు నివాస భవనాలకు అనుమతులు తీసుకుని వాణిజ్య భవనాలు నిర్మించారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. భవన నిర్మాణ దారులు రోడ్లపై సామగ్రి నిల్వ చేస్తే కఠినంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆత్మకూరు బస్టాండ్ వద్ద పూల మార్కెట్ ప్రాంగణాన్ని పరిశీలించారు. వ్యాపారులు తడి, పొడి చెత్తకు విడివిడిగా కుండీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పీ ఎస్ఆర్ బస్టాండు ప్రాంగణంలోనూ పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని డిపో మేనేజర్‌ను కోరారు. అనంతరం హరనాథపురంలోని ఎస్టీపీని సందర్శించారు.



ఆసుపత్రిలో అనుమతులపై ఆరా తీస్తున్న కమిషనర్

ఆసుపత్రిపై చర్యలు తీసుకోండి

ఆదిత్య నగర్ చిల్డ్రన్స్ పార్కు సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిని కమిషనర్ సూర్యతేజ పరిశీలించారు. ట్రేడ్ లైసెన్సు పొందకుండా, ఆస్తి పన్ను చెల్లించకుండా, సిటీ ప్లానింగ్ అనుమతు లకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించి నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని సిటీ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిపై చర్యలకు డీఎంహెచ్‌వోకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ నందన్, ఎస్ఈ రామ్మోహన్, ఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనం 80 శాతం మొలకలు రావాలి

● మండల వ్యవసాయాధికారి ఎస్వీ నాగమోహన్



నెల్లూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రబీ వ్యవసాయ సీజన్‌లో సాగుకు రైతులు ముమ్మరంగా సిద్ధమవుతున్న నేపథ్యంలో 80 శాతం మొలకలు వచ్చే విత్తనాలనే రైతులు సాగుకు వినియోగించాలి. అలా లేని పక్షంలో వాటిని కొనుగోలు చేసిన వ్యాపారికే తిరిగి ఇచ్చేయాలి. మొలక శాతం తక్కువ ఉన్న విత్తనాలు నారుమళ్లకు వినియోగిస్తే పంట ఆశించిన స్థాయిలో ఉండదని మండల వ్యవసాయ అధికారి ఎస్వీ నాగమోహన్ తెలిపారు.

? నకిలీ విత్తనాలు, పురుగు మందుల బెడదను ఎలా అధిగమిస్తారు.

! దుకాణాలపై గట్టి నిఘా పెట్టాం. విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులు విధిగా రశీదులు తీసుకోవాలి. వాటిల్లో ఏదైన తేడా వస్తే వెంటనే సదరు దుకాణాలపై చర్యలు తీసుకుంటాం. ఇటీవలే అన్ని దుకాణాలపై అంతర్గత తనిఖీలు నిర్వహించి హెచ్చరికలు జారీ చేశాం.

ఈ వారం అతిథి

? ఈ సీజన్‌లో వరికి ఏ రకం విత్తనాలు సాగు చేయాలని సిఫార్సు చేస్తున్నారు.

! ఏరకం వేయాలన్నది పూర్తిగా రైతుల ఇష్టం. వ్యవసాయ శాఖ నుంచి అయితే మంచి విత్తనాలు ఎంపిక చేసుకుని సాగు చేయాలని చెప్తున్నాం. ఆ విత్తనాలు 80 శాతం మొలకలు రావాలి. అలాంటి విత్తనాలు మాత్రమే వరి సాగుకు ఎంపిక చేసుకుంటే దిగుబడులు బాగా వస్తాయి. లేకపోతే దిగుబడుల్లో ఇబ్బందు లుంటాయి.

? బయోప్రొడక్ట్స్ బెడద ఉన్నట్టుంది.

! నెల్లూరురూరల్ మండలంలో అలాంటి ప్రొడక్ట్స్ ఎక్కడ లేవు. వరి సాగు చేసే అన్ని గ్రామాల్లో మా శాఖ సిబ్బందితో రహస్యంగా విచారణ జరుపుతున్నాం. ఇప్పటి వరకు ఎక్కడ అలాంటి జాడ కనిపించలేదు. మా తనిఖీల్లో అలాంటివి దొరికితే నిర్వహకులపై కేసులు పెడతాం.

? ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయి.

! నెల్లూరురూరల్ మండలంలో ఎక్కడా వర్షాలకు ఎలాంటి పంటలు దెబ్బతినలేదు. పైగా ఇప్పుడు కురిసిన వర్షం రైతులకు మేలు చేసింది. నార్లు పోసిన విత్తనాలు స్వల్పంగా పాడై మళ్లీ మొలకెత్తాయి. అది తప్పితే నీటి కొరత ఘననీయంగా తీరింది. అంతా సేద్యం పనుల్లో బిజీగా ఉన్నారు.

న్యూస్ బాక్స్

బ్యూటీపార్లర్‌పై అవగాహన

మనుబోలు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలోని వొకేషనల్ కోర్సు చేసే విద్యార్థినులకు మంగళవారం బ్యూటీపార్లర్‌పై అవగాహన కల్పించారు. కోర్సులో భాగంగా సదరు ఉపాధ్యాయిని కృష్ణవేణి గూడూరుకు తీసుకెళ్లి ఓ బ్యూటీపార్లర్‌లో చర్మ సౌందర్యం కోసం ఎం చేస్తారు.. ఎలాంటి ఇంగ్రిడియన్స్ వాడతారు.. వాటివలన ఉపయోగాలపై అవగాహన కల్పించారు. పదవ తరగతితో పాటు వొకేషనల్ కోర్సు చేస్తున్న విద్యార్థినులను హెచ్ఎం డేవిడ్ అభినందించారు.

రెడ్‌క్రాస్‌లో రక్తదానం

నెల్లూరు (వైద్యం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ రక్తనిధిలో సంస్థ యాజమాన్య కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్ మంగళవారం రక్తదానం చేశారు. పుట్టనరోజు సందర్భంగా 51వ సారి రక్తదా నం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యాలయ కార్యదర్శి మస్తానయ్య, కో కన్వీనర్ బలరామయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత పశు వైద్యశిబిరం

విడవలూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విడవలూరులోని పశువైద్యశాలలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పశువైద్యశాఖ ఏడీఏ చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల్లో పునరుత్పత్తి సమస్యలు, గర్భకోశ వ్యాధులు, అంటువ్యాధులు, వాటి నివారణ చర్యలపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

కనిగిరి రిజర్వాయర్‌ను కాపాడుకోవాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



నెల్లూరు(హరనాథపురం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బుచ్చి మండలంలోని కనిగిరి రిజర్వాయర్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఆమె మంగళవారం అసెంబ్లీలో మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో నీటిపారుదల ఇబ్బందులు, కనిగిరి రిజర్వాయర్ ప్రస్తుత పరిస్థితిని వివరిం చారు. సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, చేనేత రంగాన్ని ఆదుకోడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వివరించాలని కోరారు. ఇందుకు చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత సమాధాన మిస్తూ చేనేతలకు మేలు జరిగేలా వివిధ కార్యక్రమాలు చేపట్టామని, ఆప్కో షోరూంలు కూడా ప్రారంభిస్తున్నామని చెప్పారు.

అందరికీ 'సహకారం' : డీసీవో గురప్ప



మాట్లాడుతున్న డీసీవో గురప్ప

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ వ్యవస్థలో ఒక కుటుంబానికే ఆదాయం ఉంటుందని, సహకార వ్యవస్థలో అందరికీ ఆదాయం ఉంటుందని జిల్లా సహకారశాఖ అధికారి గురప్ప అన్నారు. మంగళవారం వవ్వేరు కోఆపరేటివ్ రూరల్ బ్యాంకు, బుచ్చి కోఆపరేటివ్ బ్యాంకుల పరిధిలో 71వ అఖిలభారత సహకార వారోత్సవాలు బుచ్చిలోని వవ్వేరు బ్యాంకు సమావేశ మందిరంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సహకార వ్యవస్థ అభివృద్ధికి సమష్టి కృషి జరగాలన్నారు. ఈ సమావేశంలో కావలి డివిజినల్ కోఆపరేటివ్ అధికారి ఎలమందయ్య, జిల్లా ఆడిట్ అధికారి తిరుపతయ్య, సబ్‌డివిజన్ కోఆపరేటివ్ అధికారి ఎంవీ సుభాషిణి, బుచ్చి కోఆపరేటివ్ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జ్ జి.నిర్మల, వవ్వేరు బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జ్ కట్టా సుబ్రమణ్యం, క్రిబ్‌కో ఏరియా మేనేజర్ శ్రీనివాస్, సీఈవోలు మన్నవరపు శ్రీనివాసులు, సురేష్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీవోపీడీపై అవగాహన సదస్సు

నెల్లూరు(వైద్యం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో ఊపిరితిత్తుల వ్యాధి సీవోపీడీపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. బుధవారం ప్రపంచ సీవోపీడీ అవగాహన దినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. పల్మనాలజిస్టులు డాక్టర్ సుస్మితరెడ్డి, డాక్టర్ కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ 40 ఏళ్ల పైబడిన వ్యక్తులలో సీవోపీడీ ఎక్కువగా ఉందని 60 శాతం మంది వ్యాధిగ్రస్తులు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నారని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ మహిళల్లో సీవోపీడీ బాధితుల సంఖ్య గణనీయంగా ఉందన్నారు. మెడికవర్ ఆసుపత్రిలో ఆధునాతన స్పిరో మెట్రీ, ఇమేజింగ్ పద్ధతులను ఉపయోగించి రోగులకు చికిత్సలు అందిస్తున్నామని వారు తెలియచేశారు.

చాముండేశ్వరి సేవలో కోటంరెడ్డి దంపతులు



కోటంరెడ్డికి పూర్ణకుంభం స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఇందుకూరుపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగపట్నంలో వెలిసి వున్న చాముండేశ్వరి అమ్మవారిని నుడా చైర్మన్‌గా నియమితులైన కోటం రెడ్డి శ్రీనివాసులురెడ్డి, సతీమణి సంధ్య దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. కోటంరెడ్డి దంప తులకు స్థానిక టీడీపీ నాయకుడు కొండూరు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యం లో ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు, అర్చకు లు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కొండూరు వెంకట రమణారెడ్డి, కృష్ణచైతన్య, కృష్ణారెడ్డి, బొద్దు లకూరు సుధీర్, బొద్దుకూరు సుధాకర్, దుగ్గా శంకర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు కేతిరెడ్డి అవినాష్ రెడ్డి, జనసేన నాయకుడు మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి

పొదలకూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నరసారెడ్డి గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలను ఎన్డీఏ కూటమి నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు నారదాసు రవి, కొమ్మల ప్రసాద్, వంశీ, బండి మనోజ్, మందపల్లి ప్రవీణ్, జమీర్, ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు చట్టాలపై విద్యార్థులకు అవగాహన

నెల్లూరు(క్రైం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బుజబుజ నెల్లూరులో ఉన్న శేషు పాఠశాలలో విద్యార్థులకు వేదాయపాళెం స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ కుమార్ మంగళవారం పోలీసు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈవ్ టీజింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

వీఎస్‌యూలో విద్యా విధానాలు, పరిశోధనలపై సమీక్ష



రవిశంకర్‌ను సన్మానిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్శిటీలో జరుగుతున్న విద్యా విధానాలు, పరిశోధన కార్యక్రమాలు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న వనరులపై ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్శిటీ (ఇగ్నో యూనివర్శిటీ) ప్రొఫెసర్ కే.రవిశంకర్ సమీక్షించారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూను మంగళవారం ఆయన సందర్శించారు. ఆయనకు వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, డీన్ సుజా ఎస్ నాయర్ తదితరులు పాల్గొన్నారు.

అన్‌లైన్ వర్క్‌షాప్

విక్రమ సింహపురి యూనివర్శిటీలో జాతీయ గ్రంథాలయ వారోత్సవం సందర్భంగా ఎలక్ట్రానిక్ రిసోర్సెస్ అవేర్నెస్ అండ్ ప్రాక్టీస్ అనే అంశంపై అన్‌లైన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ గ్రంథాలయ ఇన్‌చార్జ్ డాక్టర్ వైసుధారాణి తదితరులు పాల్గొన్నారు.

శబరిమల అయ్యప్ప సేవా సమాజం

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చొప్పా వెంకటేశ్వర్లు



ఎన్నికైన వారిని అభినందిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

పొదలకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్ప సేవా సమాజం రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా పొదలకూరు పట్టణానికి చెందిన చొప్పా వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడుగా ఆడపాల మస్తాన్‌రెడ్డిని ఆ ట్రస్ట్ స్టేట్ జనరల్ సెక్రటరీ మేకల వెంకయ్య, జిల్లా ప్రెసిడెంట్ బి.రాజా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని శివాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రాజా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు అయ్యప్ప దేవస్థానం చైర్మన్ మొలబంటి శేఖర్‌బాబు, ముత్తుస్వామి, గౌరవ అధ్యక్షుడు శివాడి పరంధామిరెడ్డి, వీరేపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు కోటపాటి కృష్ణమనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై కళాజాత

తోటపల్లిగూడూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం డయేరియా, మలేరియా, డెంగ్యూ, సీజనల్ వ్యాధులపై అవగాహనకు కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సీహెచ్ విజయదుర్గ విద్యార్థులకు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్.అహ్మద్‌బాషా, చావా రమేష్‌నాయుడు, సచివాలయ సిబ్బంది కె.సునీజ, ఉపాధ్యాయులు కె.హెప్సీవిద్యుల్లత, పాల్గొన్నారు.

'గండికోట'కు ప్రశంసలు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పిల్లల చేతులు పరిశుభ్రత, మరుగుదొడ్డి వినియోగం అనే అంశంపై ప్రాజెక్టు నిర్వహణపై ప్రభుత్వ ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్‌కు గ్రామాలయ వ్యవస్థాపకుడు ఎస్. దామోదరన్, దక్షిణాసియా ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్, పార్టనర్‌షిప్స్ సంచాలకుడు రవి భట్నాగర్‌ల నుంచి ప్రశంసాపత్రాలు అందాయి. బుచ్చిలో మంగళవారం ఆ పత్రాలను సుధీర్‌కుమార్‌కు ఎంఈవో దిలీప్ కుమార్ అందజేశారు.

క్రీడా పోటీల్లో గురుకులం విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

తోటపల్లిగూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఉప్పలపాడు గురుకులంలో జరిగిన జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో కోడూరు గురుకులం విద్యార్థులు ప్రతిభ చాటారు. క్యారమ్స్‌లో ప్రథమస్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్రోబాలు, కబడ్డీ, వాలీబాల్ క్రీడలలో ద్వితీయ స్థానాలు సాధించారని ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారిని పాఠశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ మౌనిక, పీఈటీ హేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం తగదు

కోవూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ కిషోర్ కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాల సమాచారం తెలిస్తే తమకు తెలియచేయాలన్నారు. ప్రభుత్వం మాదకద్రవ్యాల వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ బాషా, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంటు డాక్టర్ ఎస్.వెంకటాచలపతిగౌడ్, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసూన, తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయండి

మనుబోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆదేశించిన సర్వేలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో జలజాక్షి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆమె పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి పంచాయతీలో హౌస్‌హోల్డ్, జియోట్యాగింగ్, లిటరసీ సర్వేలతో పాటు ఎన్‌పీసీఎల్, జీపీడీపీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వీటన్నింటి ని నిర్దేశించిన గడువులోగా నూరుశాతం లక్ష్యాలను సాధించాలన్నారు. అలాగే ఉపాధి పనుల తీర్మానాలను అందజేయాలన్నారు. ఇంటి పన్నులు, కుళాయి పన్నుల వసూళ్లు ప్రారంభించాలన్నారు.

బాలలకు వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖన పోటీల విజేతలతో నిర్వాహకులు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పురమందిరం వర్ధమాన సమాజ భవనంలో మంగళవారం అంతర్జాతీయ బాలల దినోత్సవం జరిగింది. బాలభవన్, రోటరీ క్లబ్ సౌత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ఎం సతీష్, మల్లిక బేగం న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. బాలభవన్ డైరెక్టర్ జీ సుభద్రాదేవి, రోటరీ క్లబ్ నెల్లూరు సౌత్ అధ్యక్షుడు శ్రీహరి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన

కోవూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గాంధీ గిరిజనకాలనీలో గృహ నిర్మాణాలను గృహనిర్మాణ శాఖ పీడీ టీ.వేణుగోపాల్ మంగళవారం పరిశీలించారు. గిరిజన కుటుంబాలు నిర్మించుకుంటున్న ఇళ్లు సత్వరమే పూర్తయ్యే విధంగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. స్లాబులు దాకా పూర్తయిన ఇళ్లను డిసెంబరులోగా పూర్తి చేయాలన్నారు. మిగిలిన గృహాల్ని మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈ మాధవ్, గృహనిర్మాణ సిబ్బంది ఉన్నారు.

శివాలయాల్లో 'ఆరుద్ర' అభిషేకాలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం, మహాశివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శివాలయాల్లో మంగళవారం విశేష అభిషేకాలు, పూజలు, ఉత్సవాలు జరిగాయి.

● మూలస్థానేశ్వరాలయంలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకా లు, మూలమూర్తికి లక్ష బిల్వార్చన జరిగాయి. మూలస్థానేశ్వరస్వామి, భువనేశ్వరి అమ్మవారికి విశేష పూలంగిసేవ ఆకట్టుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. రాత్రి శివపార్వతులకు చిన్న వెండి నంది వాహనంపై పేట ఉత్సవం జరిగింది.

● వాహబ్‌పేట ఉమామహేశ్వరాలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పూలంగి సేవ, స్వామివారికి అన్నాభిషేకం జరిగాయి.

● పప్పులవీధి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి పల్లకి సేవ వైభవంగా జరిగింది. స్వామివారికి కమలా పండ్లతో సహస్ర నామార్చన చేశారు.

● పప్పులవీధి సిద్ధి వినాయక స్వామి ఆలయంలో మంగళవారం సంకటహర చతుర్థి పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. విశేష అభిషేకాలు, అలంకరణ, అన్నదానం చేశారు.

వృద్ధులకు అన్నదానం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. క్రాంతి, వినోద్ కృష్ణన్‌ల కుమార్తె అవ్యక్త కృష్ణ పుట్టినరోజు, ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా భోజనం, పండ్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ రాచపాలెం రఘు పాల్గొన్నారు.

రాపూరు ఎంపీటీసీ సభ్యుడి మృతి



రామచంద్రయ్య(ఫైల్)

రాపూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాపూరు బిట్-2 ఎంపీటీసీ సభ్యుడు, సీనియర్ వైసీపీ నాయకులు రేపూరు రామచంద్రయ్య, సోమవారం అర్ధరాత్రి చెందారు. సుదీర్ఘకాలం మండలంలో రాజకీయ నాయకుడిగా ఆయన అందరికీ సుపరిచితులు. ఆయన మృతి పట్ల పలుపార్టీల నాయకులు, మిత్రులు, బంధువులు సంతాపం ప్రకటించారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం ముగిశాయి.

లైంగిక దాడి కేసులో 20 ఏళ్లు జైలు

నెల్లూరు (లీగల్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ డన్న కేసులో నేరం రుజువు కావడంతో ఉప్పు రవికుమార్ అనే నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు ఇరవై వేల రూపాయల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని కొడవలూరు మండలం మిక్కిలింపేట గ్రామానికి చెందిన ఉప్పు రవికుమార్ 2020 ఫిబ్రవరి 16వ తేదీన అదే గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాలిక తల్లి కొడవలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

పిల్లలకు పుస్తక పఠనం నేర్పాలి : జడ్పీ చైర్‌పర్సన్



ఉపన్యసిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, చిత్రంలో మేయర్ స్రవంతి


నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చిన్నతనం నుంచే పిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పుస్తక పఠనం నేర్పాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. నెల్లూరులోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకల సందర్భంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆనం అరుణమ్మ, నగర మేయర్ స్రవంతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పుష్పమాల వేసి నివాళులర్పించారు. అరుణమ్మ మాట్లాడుతూ మహిళలకు ఇందిరాగాంధీ స్ఫూర్తిగా అన్నారు. గ్రంథాలయాలకు వెళ్లడం, పుస్తకాలు చదవడం అలవాటు చేసుకుంటే మంచి క్రమశిక్షణ అలవడుతుందని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని సుధారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా, జిల్లా గ్రంథాలయం అధికారి ప్రసాద్, సిబ్బంది ఎం సతీష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

● అప్పు చేసి వారోత్సవాలు

జిల్లాలో గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో అప్పు తెచ్చి నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా ఆవేదన వ్యక్తం చేశారు. గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు, పింఛనుదారులకు అక్టోబరు నెల జీతం ఇప్పటి వరకు అందలేదన్నారు. నెల్లూరు నగర పాలక సంస్థ, జిల్లాలోని మున్సిపాలిటీలు గ్రామ పంచాయతీల నుంచి రూ.40కోట్ల గ్రంథాలయ సెస్సు బకాయిలు రావాల్సి ఉందని ఆయన తెలిపారు.

ఐదేళ్ల అరాచకం

మరిచారా స్వాములూ ?



కుర్చీమీద ఉన్నపుడు ఒక తీరు.. దిగిపోతే ఇంకో తీరా?

అధికారంలో ఉన్నపుడు విపక్షాల మీద నోటికి ఎంతొస్తే అంతా మాట్లాడారు. వారి కుటుంబాలనూ సోషల్ మీడియా బజారుల్లోకి ఈడ్చారు. ఆడవాళ్ల మీద అసభ్యకరంగా పోస్టులు పెట్టారు. ఫోటోలు మార్ఫింగ్ చేశారు. వాయిస్ మార్చేశారు. అతుకులు వేసి అబద్ధాలు సృష్టించారు. గోబెల్స్‌ను తలదన్నేలా ప్రవర్తించిన నాయకుల నోట ఇప్పుడు భావప్రకటనా స్వేచ్ఛ గురించిన ప్రవచనాలు వినిపిస్తున్నాయి. మీడియాను అణగదొక్కేస్తున్నారని ఆక్రోశిస్తున్నారు. అధికార పీఠంపై నుంచి అమానవీయంగా ప్రవర్తించినవారే ఇప్పుడు నీతి పలుకులు వల్లిస్తున్నారు. తల్లినీ, చెల్లినీ కూడా వదలని రాజకీయ సోషల్ రాక్షసులను నిస్సిగ్గుగా వెనకేసుకుని వస్తున్నారు. ఐదేళ్ల అరాచకపాలనలో మగ్గిపోయిన ప్రజలు అమాయకులు కారు. అప్పుడేం జరిగిందో గుర్తు చేసుకుంటున్నారు. ఐదేళ్లు పెదవి విప్పలేకపోయిన చీకటి రోజులను తలచుకుని సోషల్ అపరిచితులకు అండగా నిలబడుతున్న నాయకులను ఈసడించుకుంటున్నారు.

అవాకులు చెవాకులు.. అబద్ధాలు.. అసభ్యపు మాటలు.. వీడియోలతో చెలరేగిపోయిన సోషల్ కేటుగాళ్లపై జిల్లాలో ఐదేళ్లు చేష్టలుడిగి ఉండిపోయిన పోలీసులు కూటమి ప్రభుత్వంలో కదులుతున్నారు. కేసులు బయటకు తీస్తున్నారు. అరెస్టులు చేస్తున్నారు. జిల్లాలో సోషల్ మీడియా కేంద్రంగా వచ్చిన ఫిర్యాదులు, చర్యల వివరాలు ఇవీ..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సోషల్ మీడియాలో అసభ్య పోస్టులను అడ్డుకోని వైసీపీ నేతలు

కూటమి ప్రభుత్వంలో కఠినచర్యలకు శ్రీకారంతో హాహాకారాలు

వేగంగా స్పందిస్తున్న పోలీసు యంత్రాంగం

కదులుతున్న పాత డొంకలు

జగన్‌కు బాసటగా భూమన ఫిర్యాదు

మాజీ సీఎం జగన్ మీద అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం భూమన కరుణాకర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆయన వెంట డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ మంత్రి రోజా, తిరుపతి మేయర్ శిరీష కూడా ఉన్నారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఐటీడీపీ విభాగం నుంచీ ఈ పోస్టులు రూపొందించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయిస్తున్నారని వీరు ఫిర్యాదులో పేర్కొన్నారు.

గతం మరచి వైసీపీ నేతల విలాపాలు

ఇపుడు సామాజిక మాధ్యమాల్లో తమ పార్టీ అధినేతకు వ్యతిరేకంగా అసభ్యంగా పోస్టులు పెడుతున్నారంటూ వైసీపీ నేతలు చేస్తున్న విలాపాలకు జనం విస్తుపోతున్నారు. 2019 నుంచీ 2024 జూన్ వరకూ వైసీపీ నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అప్పటి ప్రతిపక్ష నేతలను, మహిళా నాయకులను, వారి కుటుంబీకులను అసభ్యకర పోస్టులు పెట్టి మానసిక క్షోభకు గురి చేసిన విషయాన్ని జనం ఇపుడు గుర్తు చేసుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల నియంత్రణకు అప్పుడూ ఇవే చట్టాలు, నిబంధనలు వున్నా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో వైసీపీ వ్యక్తులు రెచ్చిపోయి విచ్చలవిడిగా వ్యవహరించిన వైనానికి, బాధితులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసు తీరుకు మచ్చుకు కొన్ని ఉదాహరణలు...

చంద్రబాబు కుటుంబంపై అసభ్యంగా..

సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల ఫోటోలు మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా పోస్టులు పెడుతున్నారంటూ తిరుపతికి చెందిన తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ళ మధుబాబు జూలై 23న తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఈస్ట్ పోలీసులు దర్యాప్తు జరిపి "నారావారి మాధవరెడ్డి" అనే ఐడీ నుంచీ పోస్టులు పెడుతున్నట్టు గుర్తించారు. ఈ పోస్టులు పెడుతున్నది అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలం నక్కలపల్లికి చెందిన ఉస్తిలి సంజీవరెడ్డి (42)గా గుర్తించారు. ఈనెల 9న అతనిని అరెస్టు చేశారు. కోర్టు రిమాండు విధించింది. రాజమండ్రి, విశాఖపట్టణం, గుంటూరుల్లో కూడా ఇతనిపై కేసులున్నాయి. దీంతో పీటీ వారెటుపై అతడిని రాజమండ్రి తీసుకెళ్ళారు.


పవన్‌పై పోస్టులు

కూటమి ప్రభుత్వం మీద, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మీద అభ్యంతరకర పోస్టులు పెడుతున్నారంటూ తిరుపతి నగర జనసేన అధ్యక్షుడు రాజారెడ్డి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వైసీపీ సానుభూతిపరుడైన ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన హరీశ్వరరెడ్డిని హైదరాబాదులోని నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. ఈకేసుతో సంబంధం వున్న మరికొందరిని కూడా ఇటీవల అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. హరీశ్వరరెడ్డిపై రాష్ట్రంలో పలుచోట్ల కేసులు నమోదై వుండడంతో పీటీ వారెంటుపై రాజమండ్రి పోలీసులు తీసుకెళ్ళారు.

జిల్లావ్యాప్తంగా 13 కేసులు నమోదు

- సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టుల మీద జిల్లాలో 13 కేసులు నమోదయ్యాయి. సీఎం చంద్రబాబుపై పెట్టిన పోస్టులపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో మూడు, తిరుమల వన్ టౌన్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అసభ్య వ్యాఖ్యలకు సంబంధించి తిరుపతి అలిపిరి, ఈస్ట్ పోలీస్ స్టేషన్లలో రెండు కేసులు నమోదు అయ్యాయి.
- శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులను చికాకు పరిచేలా పోస్టులు పెట్టిన శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన దువ్వల మాధురి (38)పై తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు రిజిష్టర్ చేశారు.
- బంగ్లాదేశ్ వరదల వీడియోలు చూపుతూ విజయవాడలో జరిగినట్టు తప్పుడు వీడియోలు పోస్టు చేసిన ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురం మండలం అనికలపల్లికి చెందిన హరీశ్వర్‌రెడ్డి మీద తిరుపతి ఈస్ట్ పోలీసులు కేసు పెట్టారు.
- రెండు రాజకీయ పార్టీలు, రెండు కులాల నడుమ ఉద్రిక్తతలు పెంచేలా వీడియోలు పోస్టు చేసి అందులో పోలీసు శాఖపై కూడా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన శ్రీకాళహస్తి మండలం తొండమనాడుకు చెందిన పోలంరెడ్డి అనే వ్యక్తిపై శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది.
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, టీటీడీ బోర్డు సభ్యుడు ఆనంద్ సాయి, టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడులపై అసభ్యకరమైన పోస్టులు పెట్టి సర్క్యులేట్ చేసిన వ్యక్తిపై తిరుమల టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.
- తిరుమల అన్నదాన సత్రంలో శ్రీవారి అన్న ప్రసాదంలో జెర్రి కనిపించిందంటూ తప్పుడు ప్రచారానికి పాల్పడిన ముగ్గురిపై తిరుమల టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.
- తిరుమలలో లడ్డూ కొనుగోలుకు ఆధార్ తప్పనిసరి అని, ఒకరికి ఒక లడ్డూ మాత్రమే ఇస్తారని తప్పుడు ప్రచారం సాగించిన వ్యక్తిపై కూడా తిరుమల వన్ టౌన్ పోలీసులు ఎఫ్ఐఆర్ బుక్ చేశారు.

టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడుపై అసభ్యంగా దూషిస్తూ పోస్టు పెట్టిన సినీ ప్రముఖుడు పోసాని కృష్ణమురళిపై సూళ్ళూరుపేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది.



జనసేన మహిళా నేత అరణ్యరోదన

2022 అక్టోబరు: తిరుపతిలో జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి జిల్లా ఎస్పీ కార్యాలయంలోని సైబర్ క్రైమ్ సెల్‌కు వెళ్ళి తన ఫోటోలను, తన కోడలి ఫోటోలను వైసీపీకి చెందిన వ్యక్తులు మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా పోస్టు చేసి కామెంట్లు పెడుతున్నారంటూ ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైమ్ సెల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ పార్టీ నేత కిరణ్ రాయల్ నేరుగా అప్పటి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. అయినా కేసు నమోదు కాలేదు. సుభాషిణికి న్యాయం జరగలేదు.

హైకోర్టు ఆదేశించినా జరగని న్యాయం

2023 డిసెంబరు: తిరుపతి జనసేన నేత కిరణ్ రాయల్ 2023 డిసెంబరులో వైసీపీ వ్యక్తులు తన కుటుంబ సభ్యుల ఫోటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అసభ్యంగా పోస్టు చేశారని, వారిపై చర్యలకు పోలీసులను ఆదేశించాలని హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన హైకోర్టు అప్పటి తిరుపతి ఎస్పీ, పుత్తూరు డీఎస్పీ, నగరి సిఐలకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయడంతోపాటు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇంతవరకూ పోలీసులు కౌంటర్ దాఖలు చేయలేదు. విచారణా జరపలేదు.



పంచాయతీలకు ఊరట

- **జిల్లాకు రూ.29.84 కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల**

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీల నిధులను దారి మళ్లించింది. పల్లెసీమల అభివృద్ధిని నీరుగార్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టింది. ఇప్పుడిప్పుడే నిధుల లేమి నుంచి ఊరట పొందుతున్న గ్రామ పంచాయతీలకు మరింత ఉపశమనం లభించనుంది. ఈ క్రమంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి తొలి విడత జిల్లాకు రూ.29.84 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. వీటిలో టైడ్ గ్రాంటు కింద రూ.17,90,96,557, అన్‌టైడ్ గ్రాంటు కింద రూ.11,93,97,710 వెరసి రూ.29,87,94,267 విడుదల అయ్యాయి. జిల్లాలోని 774 పంచాయతీల్లో 29కి ఎన్నికలు జరగలేదు. మిగిలిన 745 పంచాయతీలకు ఈ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను కేంద్ర ప్రభుత్వమే నేరుగా పంచాయతీల ఖాతాలకే కేటాయించనుంది. ఈ నేపథ్యంలో ఆయా పంచాయతీలకు జనాభా నిష్పత్తి ప్రకారం ఎంత మొత్తం వచ్చిందనే సమాచారం పంపే ఏర్పాట్లలో జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు. ఈ నిధులను పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు వినియోగించనున్నట్లు డీపీవో సుశీలాదేవి తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జూన్‌లోనూ రూ.29.50 కోట్ల ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు కేటాయించిన విషయం తెలిసిందే.

మంచి రోజులే

వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీతోపాటు వైసీపీ సానుభూతిపరులైన సర్పంచులు వడ్డీలకు అప్పులు చేసి మరీ ఖర్చు చేశారు. బిల్లులు విడుదలకాక లబోదిబోమనేవారు. నాడు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన 14, 15వ ఆర్థిక సంఘ నిధులను సైతం విద్యుత్ బకాయిల పేరిట 80శాతం మినహాయించుకోవడంతో సర్పంచులు ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో ప్రస్తుతం పంచాయతీ ఖాతాలకు నిధులు జమవుతుండటంతో సర్పంచులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. పల్లెసీమల అభివృద్ధికి ఇక మంచి రోజులు రానున్నాయని అంటున్నారు.

ఏటీఎం కొల్లగొట్టాలని..!

నాయుడుపేటలో చోరీకి యత్నించిన దుండగుడు

అలారం మోగడంతో పరార్

6

పాఠశాలకూ రాజ్యాంగం



డిజిటల్ కాలంలో ఈ బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు.. 74 ఏళ్ల కిందటి నేతల్లా.. తలపై తెల్ల టోపీలతో విద్యార్థులు ఫొటోలు దిగడం ఏంటని అనుకుంటున్నారా? మనకు స్వాతంత్య్రం వచ్చాక దేశానికి రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేసి.. రాజ్యాంగాన్ని రూపొందించిన విషయం తెలిసిందే. అదే తరహాలో శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలకూ రాజ్యాంగం రూపొందించాలని యోచించారు. ఈ మేరకు మంగళవారం రాజ్యాంగ రచన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేసి చైర్‌పర్సన్‌గా ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి.. రచనా సంఘం అధ్యక్షుడిగా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు కూనాటి సురేష్ వ్యవహరించారు.



హక్కుల కమిటీ, బాధ్యతల కమిటీ, విధివిధానాల కమిటీ తదితర కమిటీలను ఏర్పాటు చేశారు. వాటికి అధ్యక్షులుగా ఉపాధ్యాయులు, సభ్యులుగా విద్యార్థులను నియమించారు. భారత రాజ్యాంగాన్ని పోలి ఉండేలా రూపొందించి.. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. 'పాఠశాల రాజ్యాంగంలో రాజ్యాంగ ప్రవేశికతో పాటు 247 నిబంధనలు, 19 భాగాలు, నాలుగు షెడ్యూళ్లు ఉన్నాయి. 26న రాజ్యాంగ పరిషత్ సమావేశమై ఆమోదిస్తుంది. దీనిని జనవరి 26 నుంచి అమలు చేస్తాం' అని హెచ్‌ఎం రాజకుమారి తెలిపారు. కాగా, భారత రాజ్యాంగం రచనా కాలంలో నేతల వేషధారణతో విద్యార్థులు, టీచర్లు బ్లాక్ అండ్ వైట్ ఫొటో దిగారిలా. ఈ వినూత్న కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

తిరుపతి బీసీ స్టడీ సర్కిల్లో డీఎస్సీకి ఉచిత శిక్షణ

- **24వ తేదీ దరఖాస్తు గడువు**

తిరుపతి(విద్య), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి బీసీ స్టడీ సర్కిల్లో డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు స్టడీ సర్కిల్ సంచాలకుడు చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యుఎస్‌కు చెందిన 220 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ, ఆ సమయంలో స్టైఫండ్‌తోపాటు స్టడీ మెటీరియల్ కూడా అందజేయనున్నారు. బీఈడీ ఉత్తీర్ణులైన వారికి స్కూల్ అసిస్టెంట్ శిక్షణ, డీఈడీ ఉత్తీర్ణులైన వారికి ఎస్జీటీకి శిక్షణ ఇవ్వనున్నారు. టెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుచేసుకోవచ్చు. బయోడేటాతో పాటు బీఈడీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కులిస్టులు, కుల, ఆదాయ ధృవీకరణ (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు మాత్రమే) పత్రాలు, బ్యాంక్ పాస్‌బుక్, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జత పరిచి ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తిరుపతి నగరం ముత్యాలరెడ్డిపల్లి, శ్రీకృష్ణా నగర్ మొదటి క్రాస్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులను అందజేయాలి. మరిన్ని వివరాలకు స్టడీ సర్కిల్లోగాని, 94414 56039, 99850 22254, 93462 21553 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎం-ఫార్మసీ ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఎం-ఫార్మసీ కోర్సులో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఎస్వీయూనివర్సిటీ.డీఓఏ. వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 21వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీపీజీఈసెట్‌లో ఉత్తీర్ణులైన వారు ఇందుకు అర్హులు. ఏడాదికి ఫీజు రూ.1,28,940గా నిర్ణయించారు. సమగ్ర సమాచారం కోసం అడ్మిషన్ల విభాగం (డీఓఏ) లో సంప్రదించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు తెలిపారు.

జిల్లాలో పలువురు డీఎల్‌డీవోలకు పోస్టింగులు

- **నెల్లూరుజడ్పీ సీఈవోగా విద్యారమ**



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు డీఎల్‌డీవో(డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)లను వివిధ జిల్లాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాళహస్తిలోని ఈటీసీ(విస్తరణ శిక్షణకేంద్రం) గెజిటెడ్ ఇన్‌స్ట్రక్టర్ విద్యారమను నెల్లూరు జడ్పీ సీఈవోగా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఖాదర్‌బాషాను చిత్తూరుజిల్లా నగరి డీఎల్‌డీవోగా నియమించారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న జి.వి.నారాయణరెడ్డిని తిరుపతి డీఎల్‌డీవోగా నియమించారు. చిత్తూరుజిల్లా డ్వామాలో ఫైనాన్షియల్ మేనేజర్‌గా ఉన్న చిన్నరెడ్డెప్పను చంద్రగిరి క్లస్టర్ అసిస్టెంట్ పీడీగా, పూర్వపు జడ్పీ డిప్యూటీ సీఈవోగా పనిచేసిన ఆదిశేషారెడ్డిని కడపజిల్లా డ్వామా పీడీగా నియమించారు.

నేలకొరిగిన భారీ వృక్షం

- **వాహనదారులకు తప్పిన ప్రమాదం**



చంద్రగిరి, నవంబరు 19: తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారిలో శ్రీనివాసమంగాపురం సర్కిల్ వద్ద కనకదుర్గమ్మ ఆలయంలో ఏళ్ళనాటి భారీ రావి వృక్షం మంగళవారం సాయంత్రం నేలకొరిగింది. ఇటీవల వర్షాలకు చెట్టు మూలాలు నానిపోయాయి. ఈమార్గం నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. చెట్టు పడిన సమయంలో వాహనాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కొద్దిసేపు వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు చేరుకుని గ్రామస్థుల సాయంతో చెట్టు కొమ్మలను తొలగించి, వాహన రాకపోకలను పునరుద్ధరించారు.



వీధిలో వరినాట్లు

ఈ మహిళలు వరినాట్లు వేసేది పొలంలో కాదు.. వీధిలో. వర్షపు నీటితో తమ ఇళ్ల మధ్యలో ఉన్న వీధి మడుగులా మారింది. దీనికి మట్టి తోలించడంలో పాలకుల నిర్లక్ష్యానికి నిరసనగా ఇలా వరినాట్లు వేశారు. ఈ ఘటన మంగళవారం దొరవారిసత్రం మండలం కల్లూరులో జరిగింది. ఏళ్ల తరబడి మడుగులా ఉన్న తమ వీధికి మట్టి తోలమని పంచాయతీ పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

నడుములు విరగకాయ్!

ఈ రోడ్డున వెళ్లేటప్పుడు ఏమాత్రం ఆదమరిచినా నడుములు విరగాల్సిందే. చంద్రగిరి-అనుప్పల్లె మార్గంలో మల్లయ్యపల్లె మలుపు వద్ద ఉన్న గుంతకు ఇటీవల అధికారులు తాత్కాలికంగా మట్టి పోశారు. వర్షాలకు మళ్లీ యథాస్థితికి చేరింది. ఇటీవల ద్విచక్ర వాహనదారుడు నడిరోడ్డుపై ఉన్న ఈ గుంతను చివర్లో చూసి అదుపు చేయలేక కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం రోడ్లను గాలికి వదిలేయడంతో ఈ దుస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వంలోనైనా మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి





మల్లయ్యపల్లె వద్ద అదుపు తప్పి గాయపడిన ప్రయాణికుడు

అలారం మోగింది.. దొంగ పరారయ్యాడు



ఏటీఎం డోర్‌ను గునపంతో కొడుతున్న దుండగుడు



● నాయుడుపేటలో ఏటీఎం చోరీకి విఫలయత్నం

నాయుడుపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గునపం తెచ్చాడు. ఏటీఎంను పగలగొట్టే ప్రయత్నం చేశాడు. ఇంతలో అలారం మోగడంతో.. దొంగ పరారయ్యాడు. లేదంటే ఏటీఎంలో నగదు అపహరించుకుని వెళ్లేవాడేమో? ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున నాయుడుపేట బైపాస్ రోడ్డులో చోటుచేసుకుంది.

నాయుడుపేట- శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో యాక్సెస్ బ్యాంకు ముందు గదిలో ఏటీఎం ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం బ్యాంకు సిబ్బంది విధులను ముగించుకొని బ్యాంక్ షట్టర్ మూసేసి వెళ్లారు. అయితే ఏటీఎం గది మాత్రం తెరిచే ఉంటుంది. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున ఓ దుండగుడు మోటారు సైకిల్‌పై గునపంతో వచ్చాడక్కడకు. బ్యాంక్ ముందు మోటారు సైకిల్‌ను పెట్టాడు. ముఖానికి ప్లాస్టిక్ కవర్‌ను చుట్టుకొని, గునపం తీసుకుని ఏటీఎంలోకి వచ్చాడు. గునపంతో ఏటీఎం ముందు డోర్‌ను తొలగించాడు. అదే సమయంలో అలారం మోగింది. ఆ సమాచారం బ్యాంక్ హెడ్ ఆఫీసుకు వెళ్లింది. అక్కడ నుంచి నాయుడుపేట బ్యాంక్ మేనేజర్‌కు తమ ఏటీఎం వద్ద చోరీ జరుగుతున్నట్లు సమాచారం అందించారు. తక్షణమే బ్యాంక్ మేనేజర్.. అర్బన్ సీఐ బాబికి సమాచారం ఇచ్చారు. అదే సమయంలో రాత్రి గస్తీలో ఉన్న సీఐ.. హుటాహుటిన ఏటీఎం వద్దకు చేరుకున్నారు. అప్పటికే ఆ దుండగుడు పరారయ్యాడు. ఏటీఎంలో ఉన్న నగదు మాత్రం చోరీకి గురికాలేదని సీఐ వెల్లడించారు.

సీసీ కెమెరాల్లో దుండగుడు

మోటారు సైకిల్‌పై ఏటీఎం దగ్గరకు చేరుకొని తిరిగి బ్యాంక్ ఎదురుగా ఉన్న వీధిలోకి దుండగుడు ప్రవేశించిన సన్నివేశాలు సీసీ కెమెరాలలో నమోదయ్యాయి. అయితే ఎదురుగా వీధిలోకి ప్రవేశించిన తరువాత ఓ విశ్రాంత ఉపాధ్యాయుడి ఇంటి వద్ద ఉన్న కెమెరాలో మాత్రం వీధిలోకి వెళ్తున్నది కనిపించింది. ఆ తర్వాత కెమెరాలు లేకపోవడంతో దుండగుడు ఎలా వెళ్లాడనేది అంతుపట్టడం లేదు. యాక్సెస్ బ్యాంక్ ఏటీఎం వద్ద రాత్రి సమయంలో సెక్యూరిటీ లేదని తెలిసి చోరీకి యత్నించినట్లు తెలుస్తోంది. ఇక, క్లూస్ టీమ్ ఎస్ఐ దస్తగిరి సంఘటనాస్థలికి చేరుకొని వేలిముద్రలు సేకరించారు.

రద్దీ ప్రాంతంలో..

నాయుడుపేట- శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు పక్కనే యాక్సెస్ బ్యాంకు ఏటీఎం ఉంది. రాత్రి వేళల్లో ఎప్పుడూ తిరుపతికి వెళ్లే బస్సులు, ఇతర వాహనాలతో ఆ రోడ్డు రద్దీగా ఉంటుంది. పోలీస్ గస్తీ కూడా అదే రహదారిలో ఉంటుంది. అయినా దుండగుడు గునపం తీసుకొని మోటారు సైకిల్‌పై వచ్చి చోరీకి యత్నించడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది.



చోరీకి యత్నించిన ఏటీఎం వద్ద వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

● సమీక్షలు - సమావేశాలు

సౌర విద్యుత్ ఉత్పత్తిపై అవగాహన కల్పించండి



సీఎం సూర్యఘర్ యోజన పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులు

● అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశం

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ మేనేజర్‌తో కలిసి ఆయన జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి పథకాన్ని అమలు పరచడానికి 10 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులు తమ ఇంటిపైభాగంలో సౌర విద్యుత్ తయారు చేసుకుని వినియోగించుకోవచ్చన్నారు. దీనికి ప్రోత్సాహంగా ఒక కిలోవాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60వేలు, మూడు కిలోవాట్లకు, ఆపైన యూనిట్లకు రూ.78వేలు చొప్పున కేంద్రం రాయితీ ఇస్తుందని వివరించారు. ఆసక్తి గల వారు 'పీఎంఎస్‌యూఆర్‌వైఏజీహెచ్ ఏఆర్.జీవోవీ.ఇన్, ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు కోసం టోల్ ఫ్రీ నెంబరు 1912 ద్వారా సంప్రదించాలని సూచించారు. 100 కిలో వాట్లకు పైబడిన ప్రభుత్వ కార్యాలయాల్లో ఎస్‌వీవీఎన్, నెడ్ క్యాప్ ఫేజ్-1 సౌర విద్యుత్ ప్లాంట్లు అమర్చడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించాలని, మోడల్ సోలార్ విలేజ్ కోసం 5000 జనాభా ఉన్న ఐదు గ్రామాలను తీసుకుని సోలార్ గ్రామాలుగా తీర్చి దిద్దే ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి జిల్లాలో 112 ప్రభుత్వ కార్యాలయాలను గుర్తించినట్లు నెడ్‌క్యాప్ మేనేజర్ దిలీప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అనంతరం గ్రామ స్థాయి జనసురక్ష కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో జుబేదా, డీపీవో సుశీల దేవి, లీడ్ బ్యాంక్ మేనేజరు విశ్వనాథరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, నాబార్డు డెవలప్‌మెంట్ మేనేజరు సునీల్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ మేనేజర్ దిలీప్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ పాల్గొన్నారు.

భూసేకణ పనులను వేగవంతం చేయండి

జాతీయ రహదారి, రైల్వేశాఖ, రెవెన్యూకు సంబంధించి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి భూసేకరణపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రెవెన్యూ డివిజన్ అధికారులు ఎప్పటికప్పుడు ఎన్.హెచ్. అధికారులతో సమన్వయం చేసుకుని రహదారుల పనులు పురోగతిలో ఉండేలా చూడాలన్నారు. కాలూరు- వీలేరు, రేణిగుంట- నాయుడుపేట, గూడూరు- సూళ్లూరుపేటకు సంబంధించిన సాగరమాల రహదారుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్ పాల్గొన్నారు.

చెరువుల సుందరీకరణ పనులు చేపట్టండి

తిరుపతి నగరంలోని చెరువుల సుందరీకరణ పనులను ప్రాధాన్యతగా తీసుకుని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి నగరంలోని వివిధ చెరువులు, కుంటల సుందరీకరణ పనుల పురోగతిపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జేసీ శుభం బన్సల్‌తో కలిసి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి వనరులను అభివృద్ధి చేయడానికి చెరువులు పునరుద్ధరించడం కోసం సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వినాయక సాగర్, పాన్‌చెరువు, గొల్లవానికుంట, కొరమేనుగుంట చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా వినాయక సాగర్, గొల్లవానిగుంట అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. తుడా అవిలాలచెరువు అభివృద్ధికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు.

రేపు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల ఫిబ్రవరి నెల కోటాను టీటీడీ గురువారం విడుదల చేయనుంది. కల్యాణోత్సవం, ఉంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవ టికెట్లను గురువారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్ ద్వారా విడుదల చేయనున్నారు. కాగా, మరికొన్ని ఆర్జితసేవా టికెట్లకు సంబంధించి ఎలక్ట్రానిక్ డిప్ కోటాను టీటీడీ ఇప్పటికే ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. వీటిని భక్తులు బుధవారం ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. ఇక, అంగప్రదక్షిణ టికెట్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారి కోసం ప్రత్యేక దర్శన టోకెన్లు విడుదల చేయనున్నారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను విడుదల చేయనున్నారు.

ఈ విద్యార్థి ఏమయ్యాడు?



కాశ్యప ఆదిత్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో డిగ్రీ ఫైనలియర్ చదువుకుంటున్న కాశ్యప ఆదిత్య (19) అదృశ్యమయ్యాడు. ఈమేరకు ఆదిత్య సోదరుడు హైదరాబాదు నుంచీ పోలీసులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అదృశ్యమైన విద్యార్థికి సంబంధించిన ఫోన్, ఐడీ కార్డు సంస్కృత వర్సిటీలోని గరుడాచలం హాస్టల్‌లోనే వదిలి వెళ్ళినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆటోలో బయటికి వెళ్ళినట్లు యూనివర్సిటీ హాస్టల్ సీసీ ఫుటేజీలో రికార్డు అయినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై వెస్ట్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

24నుంచి గ్రామీణ ప్రీమియర్‌లీగ్

తిరుపతి(క్రీడలు), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ నుంచి 16వ గ్రామోత్సవం, రూరల్ ప్రీమియర్‌లీగ్-2024 పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన గోడపత్రికలను మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జేసీ శుభంబన్సల్, డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, ఇషా ఫౌండేషన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. 24న ఎస్వీయూ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తొలివిడతగా పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు జరుగనున్నాయి. ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదుచేసుకున్న ప్రతి పంచాయతీ క్రీడా జట్లు ఈ పోటీలకు అర్హులు. ముందస్తు నమోదు తప్పనిసరి. మరిన్ని వివరాల కోసం 83000 30999 నెంబరులో సంప్రదించాలి. ఈ పోటీల్లో మొదటి రెండు స్థానాలు కైవసం చేసుకొన్న జట్లు జోనల్‌స్థాయి పోటీలకు అర్హత సాధించి విజయవాడలో డిసెంబరు మొదటి వారంలో జరిగే పోటీలలో పాల్గొంటారు. అక్కడి విజయం సాధించిన జట్లు డిసెంబరు 28న కోయంబత్తూరులోని ఇషా కేంద్రంలో జరిగే తుది సమరంలో పాల్గొంటాయి.

- వాలీబాల్ విజేతలకు మొదటి బహుమతి రూ.9వేలు, రెండో బహుమతి రూ.6వేలు, మూడో బహుమతి రూ.3వేలు, నాలుగో బహుమతి రూ.2వేలు.
- త్రోబాల్ విజేతలకు మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడో బహుమతి రూ.2వేలు, నాల్గో బహుమతి రూ.1,500.



భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో

ప్రభుత్వ భూములను గుర్తించి కాపాడండి

రామచంద్రాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుట్టుగుంట రామాపురంలో సర్వే నంబరు 102లోని 288 ఎకరాలను ఆర్డీవో రామ్మోహన్ మంగళవారం పరిశీలించారు. గతంలో గంగిరెడ్డిపల్లి, మిట్టూరు, సి.రామాపురం దళితులకు 141 ఎకరాలను కేటాయించామని అధికారులు ఆయనకు వివరించారు. అన్నస్వామి గండిచెరువుకు 20 ఎకరాలు, కాలువలు, రహదారులకు 28 ఎకరాలు కేటాయించామన్నారు. ఇక్కడ ప్రభుత్వ భూమి 58 ఎకరాలు ఉన్నట్లు ఆర్డీవో గుర్తించారు. అన్నాసామి గండిచెరువు, సీజేఎఫ్ఎస్ భూములు, రోడ్లు, కాలువలు, ప్రభుత్వ భూములను సర్వే చేసి నివేదికలు సిద్ధం చేయాలని తహసీల్దారు వెంటకరమణ, సర్వేయర్ రమేష్‌బాబును ఆదేశించారు. 58 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగించుకునేందుకు ల్యాండ్ బ్యాంకింగ్ చేయాలన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు.



మాల కార్పొరేషన్ సభ్యురాలిగా కుమారమ్మ

తిరుపతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాల కార్పొరేషన్ సభ్యురాలిగా తిరుపతికి చెందిన తెలుగు మహిళా నేత పురిమిట్ల కుమారమ్మ నియమితులయ్యారు. ఎస్సీల సంక్షేమం కోసం కృషిచేస్తానని ఆమె చెప్పారు.

అభివృద్ధికి పచ్చజెండా

● 'పద్మావతి' వర్సిటీ పాలకమండలిలో పలు తీర్మానాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో అభివృద్ధికి మంగళవారం జరిగిన పాలక మండలి సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రాష్ట్ర ఉన్నత విద్య, ఆర్థిక శాఖల అధికారులు వర్చువల్‌గా ఈ సమావేశంలో పాల్గొనగా, పద్మావతి వర్సిటీ నుంచీ వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని, పాలకమండలి సభ్యులు హాజరయ్యారు. ఇటీవల యూనివర్సిటీకి మంజూరైన రూ.100 కోట్ల పీఎం ఉష పథకం నిధులను భవన నిర్మాణాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించడంపై చర్చించారు. విద్యుత్ ఖర్చును తగ్గించడం కోసం సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు పాలకమండలి పచ్చజెండా ఊపింది. వెబ్‌సైట్, ఇంటర్‌నెట్, సీసీ ఫుటేజీల నిర్వహణ, వంటి అంశాల్లో నాణ్యతను పెంపొందించాలని తీర్మానించినట్లు తెలిసింది.

అమ్మవారి సేవలో ఉత్తరాది మఠం పీఠాధిపతి

తిరుచానూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని మంగళవారం ఉత్తరాది మఠం పీఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామీజీ శిష్య బృందంతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో గోవింద రాజన్, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి తర్వాత సన్నిధిలోని అమ్మవారి మూల మూర్తిని వారు దర్శించుకున్నారు. ఆలయ ఏఈవో దేవరాజులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, చలపతి, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయం వద్ద సత్యాత్మతీర్థ స్వామీజీ

పార్శిల్ కేంద్రాల్లో పోలీసుల తనిఖీలు



తిరుపతి రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం),నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పార్శిల్ కేంద్రాల్లో పోలీసులు మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మత్తుపదార్థాల నిర్మూలన కోసం తిరుపతి, నాయుడుపేట, శ్రీకాళహస్తి, చంద్రగిరి, సూళ్ళూరుపేట, వాకాడు, సత్యవేడు ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. పార్శిల్ కేంద్రాల నుంచి రవాణా అవుతున్నాయనే అనుమానంతో డీఎస్పీల నేతృత్వంలో సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది తనిఖీలు చేశారు. తిరుపతిలో రైల్వే స్టేషన్, బస్టాండు ప్రాంతాల్లో ఈస్ట్ సీఐ రామకృష్ణ నేతృత్వంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఏదైనా సమాచారం ఉంటే వెంటనే డయల్ 112 కు లేదా పోలీసు వాట్సాప్ నెంబరు 8099999977 కు ఫోన్ చేసి సమాచారం అందివ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

నలుగురు స్మగ్లర్ల అరెస్ట్

● 35 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

మంగళం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ఘటనల్లో నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి 35 దుంగలు, ఒక కారు, ఒక లారీని స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐలు కేఎస్‌కె లింగాధర్, టి.విష్ణువర్ధన్‌కుమార్, సిబ్బంది ఏర్పేడు మండలం చింతలపాలెం చెక్‌పోస్టులో మంగళవారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులు ఒక కారులో వేగంగా రావడాన్ని గమనించి ఆపి తనిఖీ చేయగా అందులో పది దుంగలు ఉన్నాయి. ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా, వారు తమిళనాడుకు చెందిన వారని గుర్తించారు. కారులోని దుంగలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో కడప సబ్ కంట్రోల్‌లోని ఆర్ఐ ఎం.చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం చంద్రగిరి మండలం పాతవాటివారిపల్లెకు సమీపంలో అటవీ ప్రాంతంలో డంపింగ్ యార్డు వద్ద కొంత మంది ఎర్రచందనం దుంగలను ఓ లారీలో తరలించేందుకు లోడ్ చేస్తుండగా చుట్టుముట్టడంతో స్మగ్లర్లు పారియారు. అందులోని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 25 ఎర్రచందనం దుంగలను, ఒక లారీని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్ కర్నాటకకు చెందిన వాడుగా గుర్తించారు. రెండు సంఘటనల్లో పట్టుబడిన స్మగ్లర్లు, దుంగలను, వాహనాలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐఎం సురేష్‌కుమార్, ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు వెనుక ఉన్న ఇతర స్మగ్లర్లను అరెస్ట్ చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపారు.



పట్టుబడ్డ స్మగర్లను అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఆల్తూరుపాడు రిజర్వాయర్ భూముల పరిశీలన



దగ్గోలులో రెవెన్యూ భూములను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

డక్కిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆల్తూరుపాడు రిజ్వాయర్ భూములను మంగళవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పరిశీలించారు. రిజ్వాయర్ నిర్మాణం కోసం అటవీశాఖ ఇచ్చిన భూములకు ప్రత్యామ్నయంగా రెవెన్యూశాఖ భూములు కేటాయించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో దగ్గోలులో రెవెన్యూ భూములను సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఆల్తూరుపాడు రిజ్వాయర్ నిర్మాణం కోసం అటవీశాఖ 120ఎకరాల భూములు కోల్పోయింది. ఇందుకు రెండింతలు రెవెన్యూ భూములను అటవీశాఖకు అప్పగించాల్సి ఉందని, ఇందుకు సంబంధించి త్వరలో చర్యలు తీసుకుంటున్నామని సబ్ కలెక్టర్ చెప్పారు. అంతకముందు ఆయన డక్కిలిలో పైపులైను నిర్మాణ పనులను పరిశీలించారు. కండలేరు జలాశయం నుంచి శ్రీసిటీకి తాగునీరు అందించేందుకు ఈ ప్రాంతంలో పైపులైను నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రైతులు తమ పొలాల్లో పైపులైను వెళ్లనీయకుండా అభ్యంతాలు వ్యక్తం చేయడంతో పట్టా భూమలకు నష్ట పరిహారం చెల్లిస్తామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి అనిల్ కుమార్, పక్కనే న్యాయవాదులు ధర్మాప్రసాద్, లక్ష్మయ్య తదితరులు

సూళ్లూరుపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సూళ్లూరుపేట కోర్టు సివిల్ జడ్జి న్యాయమూర్తి ఎస్.అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం గాండ్లవీధిలో ఉన్న స్త్రీ స్వశక్తి భవనంలోని మెప్మా కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మహిళలు మొబైల్ ఫోన్ వాడకంలో జాగ్రత్తలు పాటించాలని, చెక్కులు, బాండ్లు ఖాళీగా ఇవ్వకూడదని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె.ధర్మాప్రసాద్, లక్ష్మయ్య, పీఎస్ఆర్‌వీ ప్రసాద్, ఎల్.చలపతి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదాపై అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ఇంజనీర్ నరేంద్రరెడ్డి

కోట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఆదాపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిన్నయ్య అన్నారు. మంగళవారం కోటలోని షాదీమందిర్‌లో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అసిస్టెంట్ ఇంజనీర్లు, లైన్ ఇన్స్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లకు విద్యుత్ పొదుపుపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న ఓర్జావీర్ యాప్ ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఈ యాప్ ద్వారా ఫ్యాన్‌లు, లైట్‌లు, ఏసీలు కొనుగోలు చేస్తే విద్యుత్ పొదుపు చేయవచ్చన్నారు. ఓర్జావీర్ యాప్ ద్వారా కలిగే ఉపయోగాలపై వినియోగదారులకు అవగాహన కల్పించారన్నారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

వాకాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు, దుగరాజపట్నం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారిణి దీప ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రబీ సాగులో రైతులు రూ.630 ప్రీమియం చెల్లించి ఏడాదికి పీఎంఎఫ్‌బీవై పథకం కింద వరి పంటకు రూ.42 వేల బీమా పొందవచ్చన్నారు. డిసెంబరు 31 చివరి తేదీలోగా రైతులు, కౌలు రైతులు బీమాకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తుపాన్, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు వల్ల పంట నష్టపోయిన రైతులకు ఆర్థికసాయం అందిస్తారు. పంట రుణం తీసుకున్న రైతుల ప్రీమియాన్ని బ్యాంకులు, బీమా కంపెనీలు చెల్లిస్తాయన్నారు. బ్యాంక్ రుణం లేని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ (పీఎస్‌సీ), సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు లేదా పోస్టాఫీసుల ద్వారా ప్రీమియం చెల్లించవచ్చన్నారు.

హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన

దొరవారిసత్రం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రంలోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నవజీవన్ స్వచ్ఛంద సేవా సంస్థ, సీసీపీయూ ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీసీపీయూ ప్రాజెక్టు మేనేజర్ బాలాజి మాట్లాడుతూ హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ఎన్ఎం అగ్రహారం గ్రామంలో మహిళలతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కేజీబీవీ పాఠశాల పీవో పార్వతి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏటి కాలవలో పడి ఒకరి మృతి



మృతి చెందిన సుబ్రహ్మణ్యం

గూడూరు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పారపాడు గ్రామం వద్ద ఏటి కాలవలో పడి ఒకరు మృతి చెందాడు. గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ వివరాలు మేరకు... మండలంలోని తిప్పారపాడు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం(51) సోమవారం పశువులను మేపేందుకు ఏటి కాలువ వద్దకు వెళ్లాడు. అకస్మాత్తుగా మూర్ఛ రావడంతో కాలువలో పడి మృతి చెందాడు. మంగళవారం ఉదయం కాలువ సుబ్రహ్మణ్యం తేలియా డుతుండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా పరిశీలించి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి చెల్లెలు సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ మృతి

గూడూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బ్రహ్మయ్య(45) గుండె పోటుతో మంగళవారం మృతి చెందారు. ఉద్యోగుల కథనం మేరకు... బ్రహ్మయ్య శబరిమలైకి వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకుని తిరిగి వస్తుండగా మంగళవారం కేరళలోని టెంగనూరు సమీపంలో గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. ఉద్యోగులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

ఆటో ఢీకొని వృద్ధుడి దుర్మరణ



ఈశ్వరయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మనోజ్ కుమార్

గూడూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి సమీపంలో ఆటో ఢీకొనడంతో వృద్ధుడి మృతి చెందిన మంగళవారం సంఘటన చోటు చేసుకుంది. గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ వివరాలు మేరకు... బాలాయపల్లి మండలానికి చెందిన ఈశ్వరయ్య(60) గేదెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం నుంచి గెదెలు కనపించకపోవడంతో వాటిని వెతికేందుకు గొల్లపల్లి వైపు వెళ్తుండగా వెంకటగిరినుంచి గూడూరు వైపు వెళ్తున్న ఆటో అదుపుతప్పి ఈశ్వరయ్యను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

చిల్లకూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో రోడ్డుపై పడివున్న వ్యక్తిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. పోలీసులు వివరాలు మేరకు.... నాలుగు రోజులు కితం వరగలి క్రాస్ వద్ద సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి అనారోగ్యంతో రోడ్డుపై పడి ఉండగా స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో నలుగురికి రిమాండ్

చిల్లకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దాడి కేసులో నలుగురిని రిమాండ్ తరలించినట్లు చిల్లకూరు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. మండలంలోని చింతవరం గ్రామానికి చెందిన ఉదయ్‌శేఖర్ రెడ్డి, అతని భార్యపై చింతవరం, చింతవరం కొత్తపాళెం గ్రామాలకు చెందిన అంకరావు, రవి, హరికృష్ణ, సాయి, అంకయ్య, వినయ్‌కుమార్, వెంకటకృష్ణయ్య దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నాలుగు రోజులు క్రితం అంకరావు, హరికృష్ణ, వినయ్‌కుమార్, వెంకటకృష్ణయ్యను అరెస్టు చేసి గూడూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. మిగిలిన నిందితులు హరికృష్ణ, సాయి, రవి, అంకయ్య మంగళవారం కోర్టులో లొంగిపోవడంతో వారికి న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌కు పరామర్శ



పోలయ్యను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, నవంబరు 19,(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పునబాక పోలయ్యను టీడీపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. మండలంలోని పునబాక గ్రామానికి చెందిన పోలయ్య కాలుకు శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మురళీ నాయుడు, తాళ్ల యుగందర‌గౌడ్ టీడీపీ పోలయ్యను పరామర్శించారు.

నేటి నుంచి జోనల్ స్పోర్ట్స్ మీట్

కోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల బాలుర గురుకులాల ఆధ్వర్యంలో జోనల్ స్పోర్ట్స్ మీట్ జరగనుంది. ఆయా జిల్లాలలోని 20 కళాశాలలు, పాఠశాలలకు సంబంధించి బాలురకు క్రీడలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు.

గేదెల కోసం వెళ్తే దాడి

చిల్లకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన గేదెల కోసం వెళ్తే దాడి చేసిన ఘటన గూడూరు మండలంలోని గుత్తావారిపాలెంలో మంగళవారం జరిగింది. బాధితుడి కథనం మేరకు... గూడూరు కోనేటి మిట్ట ప్రాంతంలో నివసిస్తున్న రవికుమార్‌కు చెందిన గేదెలు మూడు నెలలుగా కన బడడంలేదు. గుత్తావారిపాలెం గ్రామంలోని మణి ఇంటి దగ్గర గేదెలు ఉన్నట్లు తెలియడంతో రవికుమార్ అన్న, బావ, కడివేడు గ్రామానికి చెందిన కొంతమంది పెద్దలు కలిసి వెళ్లి అడిగారు. దీంతో గేదెలను అప్పగిస్తామని మణిని అంగీకరించాడు. పెద్దమనుషులు వెళ్లిపోయిన తరువాత మణి కర్రతో రవికుమార్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన రవికుమార్ గూడూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

డ్రం సీడర్ వినియోగంపై అవగాహన

వెంకటగిరి టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు డ్రం సీడర్ వినియోగించి వరి నాట్లు వేయడం ద్వారా ఖర్చు తగ్గి మంచి దిగుబడి సాధించవచ్చునని ఏవో సుజాత అన్నారు. మంగళవారం స్థానిక కుప్పంపల్లి, అమ్మపాళెం గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, రైతులకు డ్రం సీడర్ వినియోగంపై అవగాహన కల్పించారు.





సొసైటీసెంటర్‌లో గోతులమయంగా రోడ్డు - స్వర్ణభారతి నగర్‌లో వర్షపునీటిలో నిలిచిపోయిన ఆటోను నెడుతున్న స్థానికులు

గోతులు లేని రోడ్లే లేవు!

- మడుగుల్లా రహదారులు
- రాకపోకలకు జనం అవస్థలు

గూడూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రద్దీగా ఉండే పలు ప్రాంతాల్లో రోడ్లు గోతులమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే గోతులమయంగా మారిన రోడ్లలో వర్షపునీరు నిల్వచేరి మడుగులను తలపిస్తున్నాయి. నీరునిల్వ చేరడంతో గోతుల లోతు అంచనా వేయలేక వాహనదారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో పట్టణంలోని ప్రధాన రహదారులు దారుణంగా దెబ్బతిన్నారు. స్థానిక సొసైటీ సెంటర్‌లో రోడ్డు రూపుకోల్పోయి గోతులమయంగా దారుణంగా తయారయ్యింది. రెండో పట్టణం నుంచి ఒకటో పట్టణానికి రాకపోకలు సాగించే ప్రధాన రహదారి స్వర్ణభారతి నగర్ సమీపంలోని తిరుపతి రైల్వేగేటు వద్ద వర్షం పడిందంటే మోకాలు లోతు నీరు నిల్వ చేరిపోతుంది. ఈ మార్గం ద్వారా ఒకటో - రెండో పట్టణాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా ఎస్‌కేఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాల, ఐటీ, సిరామిక్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు ఒకటో పట్టణానికి చెందిన వారు, ఇతరులు ఈ మార్గం ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షానికే నీరు నిల్వ చేరి మడుగుగా మారడంతో వాహనదారులు, పాదాచారుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. వాహనాల ఇంజన్లలోకి నీరు చేరి వాహనాలు మధ్యలోనే నిలిచిపోతుండడంతో నానా అగచాట్లు పడాల్సి వస్తోందోనని ఆవేదన చెందుతున్నారు. ఇదేవిధంగా స్థానిక రైల్వేక్వార్టర్స్ సమీపంలో, రైల్వేస్టేషన్ నుంచి రైల్వే క్వార్టర్స్‌కు వెళ్లే మార్గంలో రైల్వేస్టేషన్ సమీపంలో రోడ్డు అక్కడక్కడ దెబ్బతిని గోతులమయంగా మారడంతో వర్షపునీరు నిల్వచేరి ఉండడంతో రాకపోకలు కష్టతరంగా ఉన్నాయని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పట్టణంలో రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రైల్వేస్టేషన్ సమీపంలో గోతుల రోడ్డులో నిల్వచేరిన వర్షపునీరు

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అరికట్టండి



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

గూడూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. కొందరు రాత్రి సమయాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరు, విద్యుత్ తీగలను అపహరించుకుని వెళుతున్నారు. దీంతో పంటలకు నీరు పెట్టుకునేందుకు విద్యుత్ సౌకర్యం లేక అవస్థలుపడాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఐదు రోజుల క్రితం వెస్టుగూడూరు ప్రాంతంలోని పంబలేరు సమీపంలో రైతులు పెంచలనరసారెడ్డి, వెంకటేశ్వర్లు పొలాల్లోని 25, 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను కొందరు ధ్వంసంచేసి అందులోని వస్తువులను అపహరించుకు వెళ్లారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అరికట్టడంతో పాటు త్వరితగతిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టి సాగుకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రైతులు, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

కోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ద్వారా అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ అధికారి వంజివాక నిరంజన్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం, కోట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ప్రకృతి వ్యవసాయం వల్ల ఉపయోగాలపై పోస్టర్లను అధికారులు, రైతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరి నారుమడిలో కలుపు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో రైతులు పోసిన నారుమడులను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సాయి కుమార్, వ్యవసాయ సహాయకులు ప్రభు కిరణ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, నోడల్ మేకర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి నివాళి

సూళ్లూరుపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆర్టీసీ బస్టాండు సెంటర్ వద్ద మంగళవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వెంకటా చలపతి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బద్దెపూడి రాజారెడ్డి, పొన్నా లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీలక్ష్మీబాయి జయంతి

నాయుడుపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీఎంఆర్ కళాశాలలో మంగళవారం ఝాన్సీలక్ష్మీబాయి జయంతి వేడుకలను నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సన్ని, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తణుకు చెందు, విద్యార్థులు పాల్గొన్నారు.

తీర ప్రాంత రక్షణపై రెండు రోజుల శిక్షణ

సూళ్లూరుపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత రక్షణ, భద్రతపై శ్రీహరికోట పోలీస్ స్టేషన్‌లో బుధ, గురువారాల్లో రెండు రోజుల నేవీ, కోస్టుగార్డ్, మెరైన్, సివిల్ పోలీసులకు తీరప్రాంత రక్షణపై ఎక్సర్‌సైజ్ సీవిజిల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు.

పోస్టాఫీసుల్లో ఖాతాల కోసం ప్రత్యేక క్యాంప్‌లు

తడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు పోస్టాఫీసుల్లో కొత్తగా ఖాతా తెరవడానికి ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహిస్తున్నమని ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, పోస్టల్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

పాఠశాలల పనివేళల పెంపు సరికాదు

బాలాయపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాల పనివేళల పెంపు సరైన నిర్ణయం కాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన సంసిద్ధత, రవాణా సౌకర్యం వంటి అంశాలను పరిగణలోకి తీసుకోకుండా పాఠశాలల పనివేళలను పెంచడం సరికాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 5 నుంచి 15 కిలోమీటర్లు దూరం నుంచి విద్యార్థులు పాఠశాలలకు వస్తారన్నారు. సకాలంలో రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల బాలికలకు భద్రతాపరమైన సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

ఓజిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోంది. పార్టీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు అధ్వర్యంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు సభ్యత్వ నమోదును పర్యవేక్షిస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకు 60 శాతం సభ్యత్వ నమోదు పూర్తి చేసినట్లు పార్టీ నేతలు తెలిపారు.

సంఘమేశ్వరుడికి అన్నాభిషేకం



కోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీ దేవి సమేత సంఘమేశ్వర ఆలయంలో మంగళవారం కార్తీక మాస పూజలు జరిగాయి. ప్రముఖ వ్యాపారవేత్త శ్రీనివాసులు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌స్వామి సంఘమేశ్వరుడి మూలవిరాట్‌కి రుద్రాభిషేకం, అన్నాభిషేకం చేశారు. సంఘమేశ్వరుడి మూల విరాట్‌ను అన్నంతో అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీనివాసులు దంపతుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లఉత్సవ విగ్రహాలతో గూడలి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోండి

ఓజిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా వీఆర్వోలు అడ్డుకోవాలని తహసీల్దారు పద్మావతి సూచించారు. మంగళవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ఆక్రమణలలో ఉన్న భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. మేత పొరంబోకు, గ్రామనత్తం భూములపై దృష్టి పెట్టాలని తహసీల్దారు అన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో అన్నదానం

గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గమ్మళ్లపాళెంలోని వృద్ధాశ్రమంలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో చెంచు నారాయణ, పురుషోత్తమ రావు, విజయబాబు, హిబ్రహి, శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక అడవయ్య కాలనీలోని అనాథ శరణాలయంలో వృద్ధులకు బాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో గోరపాటి రవీంద్ర బాబు, సురేంద్ర, సుధీర్, బాషా ఛాన్, గఫూర్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

గూడూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏబీవీపీ నగర కార్యదర్శి నజీర్ అన్నారు. మంగళవారం పట్టనంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఏబీవీపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నగర కార్యదర్శిగా నజీర్‌ను ఏన్నుకున్నారు.

విత్తన శుద్ధికి ప్రాధాన్యం ఇవ్వండి

ఓజిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు వివిధ పంటల సాగుకు మేలు రకాల వంగడాలను ఎంపిక చేసుకుని విత్తన శుద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని ఏవో విజయలక్ష్మి అన్నారు. ఓజిలి మండలంలోని రుద్రాయపాళెం, ఆచార్లపార్లపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగులో మెలకువలు, ఎరువులు, పురుగు మందుల వాడకం తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

వాకాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెమినీ కొత్తపాళెం గ్రామానికి చెందిన కుంబాల అంకయ్య వద్ద 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వాకాడు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు. బెల్టుషాపులు నిర్వహించిన, అక్రమంగా మద్యం తరలించినా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎల్డి పంటకు ఊపిరి

- వర్షాలతో కళకళలాడుతున్న వరి

పెళ్లకూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత వారం రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలు ఎల్డి సాగు చేసిన వరి పంటలకు ఊపిరిపోశాయి. పెళ్లకూరు మండలంలో 12000 ఎకరాలు మాగాణి భూములు, 4000 ఎకరాలు మెట్ట భూములు ఉన్నాయి. ఈ భూముల్లో రైతులు అధికంగా రబీ సీజన్‌లో వరి సాగు చేస్తారు. ఇటీవల కురిసిన వర్షాలకు తోడు చెంబేడు, పునబాక, అర్ధమాల, చిల్లకూరు, పెళ్లకూరు తదితర చెరువులకు తెలుగుగంగ నీరు చేరడంతో రైతులు నారుమడులు సిద్ధం చేసుకుని వరినాట్లు చేపట్టారు. కాగా, మెట్ట ప్రాంతాలైన సంగాలపల్లి, చెన్నప్పనాయుడుపేట, మోదుగులపాలెం, బంగారంపేట, నందిమాల తదితర గ్రామాల్లో సుమారు 600 ఎకరాలకు పైగా వరి ఎల్డి పైర్లను సాగు చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరి పంటలు, ఉద్యాన పంటలు కళకళలాడుతున్నాయి. ముసురు వర్షాలతో వరినాట్లు వేసిన రైతులతో పాటు, ఎల్డి పంటలు వేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మోదుగులపాలెంలో కళకళలాడుతున్న ఎల్డి పైరు